




ఆయుధాలకు
## సానబడుతున్న భారత్
అరేబియా సముద్రంలో సీ స్కిమ్మింగ్ టెస్ట్ సక్సెస్

2


# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:119 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |




వెతికి వెతికి వేటాడ్తం
కలలో కూడా ఊహించని
## శిక్ష విధిస్తాం..
- ఉగ్రవాదులకు, వారి వెనుకనున్న శక్తులకు ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్
- ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేస్తం

2



## రాష్ట్రపతితో అమిత్ షా భేటీ

ఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్ర ఘటన నేపథ్యంలో భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. రాజకీయ, దౌత్య పరమైన కార్యకలాపాలు ఒక పక్క జరుపుతూనే ఇరు దేశాలూ సైనిక తయారీలు చేసుకుంటున్నట్టు వార్తలు పొక్కుతున్నాయి. చోటుచేసుకుంటున్న ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. కావడం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్ర దాడి ఘటనకు సంబంధించి పలు అంశాలను ఆమెకు

...మిగతా 2లో

కలిసి రండి..
# కఠిన చర్యలు తీసుకుందాం
### అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వ హామీ
- ఏ చర్యలు తీసుకున్నా మద్దతిస్తామన్న కాంగ్రెస్
- ఉగ్రదాడిపై ఆల్ పార్టీ మీటింగ్‌లో మృతులకు సంతాపంగా మౌనం పాటించిన నాయకులు





ఢిల్లీ, ఏప్రిల్ 24: ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడిపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ''జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా

...మిగతా 2లో

# దేశమంతా సమైక్యంగా నిలబడాలి
### కేంద్రం చేపట్టే ప్రతి కార్యక్రమానికి సంఘీభావం
- దేశ సుస్థిరత, సమగ్రతను దెబ్బతీసే శక్తులను దీటుగా ఎదుర్కోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉగ్ర దాడి మతులకు నివాళి





విశాఖపట్నం: 'దేశానికి ఎంతో కీలకమైన కశ్మీర్‌లో ఇటీవల ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించి గత మూడేళ్లుగా ప్రశాంత వాతావరణంలో అభివద్ధికి శ్రీకారం చుట్టారు. అలాంటి సమయంలో ఉగ్రదాడి జరగడం చాలా బాధాకరం. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ దీన్ని తీవ్రంగా ఖండించాలి' అని ముఖ్యమంత్రి

...మిగతా 2లో

అది పాక్‌కు మరణ
# శాసనమే
### సింధూ నదీజలాల ఒప్పందం రద్దుతో పాక్ కూసాలు కదులుతున్నాయ్
ఆదేశంలో సాగుకు వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం పరిధిలోనివే..

దాని జీడీపీలో 25 శాతం ఈ నదీ జలాలే కంట్రిబ్యూట్ చేస్తాయి




2

## గత ప్రభుత్వం పంచాయతీ నిధులన్నీ నిర్వీర్యం చేసింది



అమరావతి: గ్రామ పంచాయతీల నిధులన్నీ గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విమర్శించారు. బిల్లులు రాకపోయినా పనులు చేసిన గుత్తేదారులకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పవన్ పాల్గొని మాట్లాడారు. ''పంచాయతీరాజ్ శాఖను ఇష్టంగా తీసుకున్నా. గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలి. పల్లెల్లో ఉండటమంటే ఇష్టం.. కానీ కుదరలేదు. అధికారులు కషితో గ్రామాల్లో వేగవంతమైన అభివద్ధి సాగుతోంది. గతంలో చాలా తండాల్లో పర్యటించా.. అభివద్ధి చేయాలని నిర్ణయించాం. చిన్న పైరవీలు చేసినా చర్యలు తప్పవు'' అని పవన్‌కల్యాణ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు.



## పాలనలో ఏఐ వినియోగించినా..
# మానవీయ కోణం ముఖ్యం

అమరావతి: 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైనా సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌నకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీశాఖ మాజీ సెక్రెటరీ చంద్రశేఖర్ సహా పలువురు నిపుణులు హాజరయ్యారు.



గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, ఫలితాలను పరిశీలించారు. ఏయే విభాగాల్లో ఎలాంటి సాంకేతికత వాడొచ్చు. ప్రస్తుత సమాచారం ఆధారంగా సేవలను ఎలా విస్తృత పరచవచ్చు అనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలనలో ఏఐ వినియోగించినా.. మానవీయ కోణం ముఖ్యమని సీఎం అన్నారు. టెక్నాలజీ వినియోగంతో రియల్‌టైమ్‌లో సేవలు అందిస్తామన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తామన్నారు. భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు జరగనుంది.

## శ్రీవారి సేవలో ప్రముఖ నటి మీనాక్షి చౌదరి



తిరుమల,ఏప్రిల్24,మనం న్యూస్: శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని నటి మీనాక్షి చౌదరి దర్శించుకున్నారు. గురువారం వేకువజాము సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా.. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆలయం వెలుపల మీనాక్షి చౌదరిని చూసేందుకు ఆమెతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అనంతరం మీనాక్షి చౌదరి మీడియాతో మాట్లాడుతూ..తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుమల మళ్ళీ మళ్ళీ రావాలనిపిస్తుందని తెలిపారు. నాగ చైతన్య, నవీన్ పోలిసెట్టి లతో సినిమాలు చేస్తున్నట్లు వెల్లడించారు. మరికొన్ని చిత్రాలు త్వరలో ప్రకటిస్తానని తెలియజేశారు.

## ఆంజనేయులు కస్టడీ కోరుతూ సీఐడీ పిటిషన్

అమరావతి: ముంబయి సినీ నటి కాదంబరీ జెత్వానీపై కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులను కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ముంబయికి చెందిన సినీ నటి కాదంబరీ జెత్వానీపై తప్పుడు కేసు పెట్టించి, అక్రమంగా అరెస్ట్ చేసి వేధింపులకు గురిచేసిన కేసులో ఏ2గా ఉన్న పీఎస్ఆర్

..మిగతా 2లో



## ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంటేనే స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తాయి
### మంత్రి నారాయణ

అమరావతి: రాజధాని అమరావతిలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో 90 శాతం ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే నెల 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి పనులు పునఃప్రారంభమవుతాయని చెప్పారు. సభా వేదిక

...మిగతా 2లో

## తిరుమలలో హై అలర్ట్
### అలిపిరి చెక్ పాయింట్, ఘాట్ రోడ్డులో క్షుణ్ణంగా తనిఖీలు
### ఆక్టోపస్ సిబ్బంది వందమందితో మాక్ డ్రిల్





తిరుమల, ఏప్రిల్24, మనం న్యూస్: జమ్మూకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో హై అలర్ట్ ప్రకటించారు.తిరుమల కొండతో పాటు తిరుపతిలో కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. తిరుపతి నుండి తిరుమల కు వెళ్లే ఆలిపిరి చెక్పోస్టు, ఘాట్ రోడ్లలో పోలీసులు,టీటీడి భద్రతా సిబ్బంది వాహనాలు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపారు. కీలక ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించి పెట్రోలింగ్ను ముమ్మరం చేశారు. అలిపిరి టోల్గేట్

...మిగతా 2లో

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జ్ నమోదు



అమరావతి: సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జ్ నమోదైంది. సర్వీసు నిబంధనల ఉల్లంఘన, వివిధ అభియోగాలతో ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జ్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సీఐడీ చీఫ్‌గా, అగ్నిమాపకశాఖ డీజీగా నిబంధనలు ఉల్లంఘించారని తేలడంతో ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకుంది. ప్రభుత్వానికి తెలియకుండా పలుమార్లు సునీల్ విదేశీ పర్యటనలకు వెళ్లినట్లు విచారణలో తేలింది. 2022లో జార్జియా పర్యటనకు అనుమతి తీసుకొని యూఏఈకి, మరోసారి అనుమతి లేకుండా స్వీడన్ వెళ్లాడని ప్రభుత్వం పేర్కొంది. వెయింటింగ్‌లో ఉన్నప్పుడూ అనుమతి తీసుకోకుండా అమెరికా వెళ్లాడని మూడో ఛార్జ్ నమోదు చేసింది.

# అది పాక్‌కు మరణ శాసనమే

**ఢిల్లీ, ఏప్రిల్ 24:** సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికే వరకు దాయాది దేశంతో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు భారత్ చేసిన ప్రకటన పాకిస్తాన్‌కు మరణ శాసనమే. దీనితో ఏం చేయాలో దిక్కుతోచని పాక్ అక్కసు వెళ్లగక్కింది. 'సింధూ నదీ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధం. ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు మధ్యవర్తిగా ఉన్న ఈ ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగే అవకాశం లేదు. ఈ చర్యతో నీటి యుద్ధానికి తెరతీస్తున్నారు. ఈ జలాల్లో ప్రతి నీటి చుక్కా మాదే..! ఈ హక్కును మేం చట్టపరంగా, రాజకీయంగా, అంతర్జాతీయంగా పూర్తిశక్తితో కాపాడుకుంటాం'' అని పాకిస్థాన్ మంత్రి అవాయిస్ లెఘారీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకున్నాడు. అయితే ఏ దేశంతో కుదుర్చుకున్న ఒప్పందాన్నైనా రద్దుచేసుకునే హక్కు భారత్ కు ఉంది. అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒప్పందంపై భారత్ సంతకం చేయనందున పాక్ అంతర్జాతీయ కోర్టుకు పోయినా అదిచ్చే తీర్పు భారత్ కు వర్తించదు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. వ్యవసాయానికి వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం కింద లభిస్తున్నవే కావడం గమనార్హం. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశానికి మరణ శాసనం కాకుండా ఎలా ఉంటుంది.

**షెహబాజ్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి సమావేశం..**

పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న దౌత్య చర్యలపై పాక్ స్పందించింది. ఈ అంశంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో సమావేశమైన ఆ దేశ అత్యున్నత కమిటీ పలు అంశాలను చర్చించింది. మంత్రులు, త్రివిధ దళాలకు చెందిన అధిపతులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు భారత్ తీసుకున్న చర్యలనే దాదాపు ఆ దేశం కాపీ కొట్టింది.సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా తమ దేశంలో పర్యటిస్తున్న భారత జాతీయులకు అనుమతులతో పాటు, ఇతర వీసాలను సైతం పాక్ రద్దు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో నిన్న జరిగిన అత్యున్నత సమావేశంలో భారత్ సైతం ఇదే నిర్ణయం తీసుకుంది. పాక్లోని హైకమిషన్ కార్యాలయంలోని భారత దౌత్య సిబ్బందిని 30కి తగ్గించింది. అంతకుముందు భారత్ కూడా ఇదే చర్యలను ప్రకటించింది. నిన్నటి సమావేశంలో అటారీ బోర్డర్ను మూసివేయాలని భారత్ నిర్ణయించగా.. పాకిస్థాన్ సైతం వాఘా బోర్డర్ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు పాక్ గగనతలంంలోకి భారత్ కు చెందిన విమానాలు గానీ, భారతీయ సంస్థలు నడుపుతున్న విమానాలు గానీ ప్రయాణించకుండా ఎయిర్స్పేస్ను మూసివేసింది. సౌదీ పర్యటన ముగించుకున్న అనంతరం ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించింది. ఈ నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. భారత్ తో వాణిజ్యాన్ని తెగదెంపులు చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని అమలును భారత్ తక్షణమే నిలిపివేయడాన్ని పాక్ ఖండించింది. 24 కోట్ల పాకిస్థాన్ పౌరులకు సంబంధించిన అంశంగా పేర్కొంది. సింధు జల ఒప్పందం ప్రకారం పాకిసాన్ కు ఉద్దేశించిన నీటిని మళ్లించడానికి లేదా ఆపడానికి జరిగే ప్రయత్నాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పేర్కొంది.

# కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం..



**పాట్నా, ఏప్రిల్ 24 :** ఉగ్రవాది ఏ మూలన, ఏ తొర్రలో దాక్కున్నా వెతికి వేటాడి ఊహించని విధంగా శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోడీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం 'ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు, భారతీయాత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం' అని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు'' అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు.

**ప్రపంచ దేశాలకు ధన్యవాదాలు..**

ఈసందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియపరుస్తూ 'మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదు' అని అన్నారు.

**ఇండియా విల్ పనిష్..**

'ఇండియా విల్ ఐడెంటిఫై, ట్రాక్ అండ్ పనిష్ ఎవ్రీ టెర్రరిస్ట్ అండ్ దేర్ బ్యాకర్స్' (ప్రతి ఒక్క ఉగ్రవాదిని, వారికి మద్దతుగా నిలిచేవారిని భారత్ గుర్తించి, వెంటాడి, శిక్షిస్తుంది) అంటూ ప్రధాని మోదీ ఆంగ్లంలో స్పష్టం చేశారు. 'ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడతాం. ఉగ్రవాదంతో దేశ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేరు. ఉగ్రవాదాన్ని శిక్షించకుండా వదిలిపెట్టబోం. బాధితులకు న్యాయం చేకూరేలా అన్ని విధాలా ప్రయత్నిస్తాం.

## ఆంజనేయులు కస్టడీ కోరుతూ సీఐడీ పిటిషన్

(మొదటి పేజీ తరువాయి)

ఆంజనేయులను సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు విజయవాడ సీఐడీ కోర్టు మే 7 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అనంతరం ఆయన్ని విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. ఈ నేపథ్యంలో సీఐడీ తాజాగా ఆయన్ని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది.

ఓ పారిశ్రామికవేత్తను అత్యాచార కేసు నుంచి బయట పడేసేందుకు అప్పటి సీఎం జగన్ హయాంలో సీఎంవో కేంద్రంగా నాటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ తదితరులతో కలిసి ఫోర్జరీ దస్త్రం ఆధారంగా తనపై అక్రమ కేసు పెట్టి, వేధించారని కాదంబరీ జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న ఆంజనేయులును సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు.

## రాష్ట్రపతితో అమిత్ షా భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వివరించినట్లు సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోను రాష్ట్రపతి తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.

**కీలక దేశాలతో భేటీ..**

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా, కెనడాతో సహా జీ 20 దేశాల ఎంపిక చేసిన రాయబారులతో సమావేశం నిర్వహించింది.

## కలిసి రండి.. కఠిన చర్యలు తీసుకుంటం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారు'' అని కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ సముదాయంలోని భవనంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. పహల్గాం ఉగ్రదాడిని అందరం ముక్తకంఠంతో ఖండించాం. కేంద్రం తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చాం.

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత**

కశ్మీర్లో శాంతియుత పరిస్థితుల కోసం కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాం.

**- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు**

ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం వెన్నంటే ఉన్నాం. ప్రధాని మోదీ వీలైనంత త్వరగా అన్ని పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశాం.

# ఆయుధాలకు సానబడుతున్న భారత్

**బెంగళూరు, ఏప్రిల్ 24:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. భారత సైన్యం దేనికైనా సై అంటూ సంసిద్ధంగా ఉంది. దీనిలో భాగంగానే నేడు నౌకదళం సీ స్కిమింగ్ సక్సెస్‌ఫుల్‌గా టెస్ట్ చేసింది. గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ గగనతలంలో కదులుతున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీస్కిమ్మింగ్ టార్గెట్లుగా పేర్కొంటారు. ఐఎన్ఎస్ సూరత్, వివిధ రకాల మిలటరీ ప్లాట్ ఫామ్‌లతో కలిసి



లక్ష్యాన్ని ట్రాక్ చేస్తూ ధ్వంసం చేసింది. టార్గెట్‌పైకి మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్-ఎస్ఏఎం) ను వినియోగించారు.

**పాక్ క్షిపణి పరీక్షలకు సిద్ధమైన వేళ..**

ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో 24, 25 తేదీల్లో ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలు నిర్వహిస్తామంటూ పాక్ మిలటరీ నోటమ్ విడుదల చేసింది. ఇదే సమయంలో ఐఎన్ఎస్ సూరత్ సీస్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించడం గమనార్హం.

**కర్వార్లో విక్రాంత్..**

విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ అరేబియా సముద్రంలో కర్ణాటకలోని కార్వార్ పోర్టు సమీపంలో ఇది గస్తీ కాస్తోంది. కాకపోతే కొన్ని వారాల ముందే అనుకొన్న ప్రణాళిక ప్రకారమే దీని మోహరింపు జరిగిందని చెబుతున్నా.. పహల్గాం దాడి వేళ ఈ సమాచారం బయటకు రావడం గమనార్హం.

## తిరుమలలో హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తిరుమల శ్రీవారి ఆలయం వరకు సెక్యూరిటీ సిబ్బంది, అక్టోపస్, పోలీసు బృందాలు మోహరించాయి.భక్తులు శాంతియుతంగా, అంతరాయం లేకుండా శ్రీవారి దర్శనానికి వెళ్లేలా భద్రతా అధికారులు శ్రీవారి ఆలయం, చుట్టుపక్కల రౌండ్-ది క్లాక్ పర్యవేక్షణను నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందనే నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కూడా అప్రమత్తమైంది. శ్రీవారి ఆలయ పరిసరాల్లోనూ భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు.మరోవైపు ఆక్టోపస్ దళం కూడా అప్రమత్తమైంది. ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను గురువారం తిరుమలలోని సుదర్శన్ భవనం వద్ద వంద మందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్లో అక్టోపస్, పోలీస్, విజిలెన్స్, మెడికల్ టీమ్ పాల్గొని ఉగ్రదాడిని ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలని భక్తులకు అవగాహన కల్పించారు.

# ఉగ్రవాదులు తప్పుదారి పట్టిచ్చిండ్రు?

- **దాడిలో మరణించిన కావలి వాసి మధుసూదన్ భార్య**
- **'ప్లీజ్ నన్ను చంపొద్దు' అని వేడుకున్నా వదల్లేదు**
- **భయానక ఘటనను వివరించిన భరత్ భూషణ్ భార్య**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** పర్యాటక స్వర్గధామం కశ్మీర్‌లో.. ఇటీవల జరిగిన ఉగ్రదాడి తీవ్ర విషాదాన్ని నింపింది. పహల్గాంలో జరిగిన ఈ కాల్పుల ఘటనలో కావలికి చెందిన మధుసూదన్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఆయనతోనే ఉన్న భార్య, ఆ భయానక క్షణాలను, ఉగ్రవాదుల క్రూరత్వాన్ని కన్నీటిపర్యంతమవుతూ వివరించారు. కశ్మీర్ సురక్షితంగా ఉంటుందనే నమ్మకంతోనే తాము విహారయాత్రకు వెళ్లామని, కానీ ఇంతటి దారుణం జరుగుతుందని ఊహించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మధుసూదన్ భార్య తెలిపిన వివరాల ప్రకారం... తమ మూడు కుటుంబాలకు చెందిన పది మంది పహల్గాం విహారయాత్రకు వెళ్లారు. స్థానికంగా 'మినీ స్విట్జర్లాండ్'గా పిలిచే ప్రాంతానికి గుర్రాలపై వెళ్లి, భోజనం చేశారు. మధుసూదన్, ఆయన భార్య ఇద్దరూ భోజనం ముగించుకుని బయటకు వచ్చిన కొద్దిసేపటికే కాల్పుల శబ్దాలు వినిపించాయి. భయంతో వారు పరుగులు తీస్తుండగా, శాలువాలు అమ్మే కొందరు స్థానికులు వారిని అడ్డుకొని, అవి కేవలం కశ్మీరీ వార్షికోత్సవ వేడుకల శబ్దాలని, భయపడాల్సిన పనిలేదని చెప్పి తప్పుదోవ పట్టించినట్లు ఆమె తెలిపారు. 'మేము పరిగెడుతుంటే వాళ్ళు మమ్మల్ని మిస్‌గైడ్ చేస్తూ.. అది కేవలం వేడుకలని, ఇక్కడే ఉండండి అన్నారు' అని ఆమె పేర్కొన్నారు. అయితే, అక్కడే ఉన్న ఒక హోటల్ యజమాని మాత్రం ప్రమాదాన్ని పసిగట్టి.. తమ పిల్లలను, ఇతరులను వెంటనే పారిపోవాలని హెచ్చరించినట్లు చెప్పారు. హోటల్ యజమాని హెచ్చరికతో పిల్లలు, కొందరు ముందుగానే పారిపోయారని, కానీ తాము పారిపోయేలోపే ఉగ్రవాదులు కాల్పులు జరుపుతూ దగ్గరకు వచ్చారని మధుసూదన్ భార్య వివరించారు.

ఆ సమయంలో తన భర్త, 'మనమిద్దరం ఇక్కడే పడుకుందాం, నువ్వు తల ఎత్తవద్దు' అని చెప్పినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. ఇద్దరూ చేతులు పట్టుకుని నేలపై పడుకుని ఉండగా, ఎవరో నడుచుకుంటూ వచ్చిన శబ్దం వినిపించిందని, వెంటనే ఒక పెద్ద పేలుడు శబ్దం (కాల్పుల శబ్దం) వినిపించిందని తెలిపారు. 'ఆ షాట్‌కు ముందు 'హిందూయే? ముస్లిమే?' అని రెండు సార్లు అడిగారు. అసమయంలో తాము ఏమీ స్పందించలేదు. వెంటనే షాట్ సౌండ్ వినిపించింది. నేను, లేచి చూసేసరికి నా భర్త ముఖం మొత్తం రక్తంతో నిండిపోయింది' అని చెబుతూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన దుస్తులు కూడా రక్తంతో తడిసిపోయాయని, ఆ షాట్ తమవైపే జరిగిందని అప్పుడు అర్థమైందని ఆమె వాపోయారు.

తన భర్తను కాల్చిన తర్వాత, తాను కూడా బయటకు పరిగెత్తానని, ఎవరైనా రక్షించేవారు కనిపిస్తారేమోనని చూశానని, కానీ ఎవరూ కనిపించలేదని ఆమె తెలిపారు. అక్కడున్న కొందరు తనను ఆర్మీ క్యాంప్ వద్దకు తీసుకెళ్లారని చెప్పారు. ఉగ్రవాదులు అత్యంత క్రూరంగా ప్రవర్తించారని, తమ పక్కనే ఉన్న జైపూర్‌కు చెందిన దంపతులు తమ రెండేళ్ల చిన్నారిని చూపిస్తూ కాళ్లు పట్టుకుని వేడుకున్నా కనికరించకుండా కాల్చి చంపారని ఆమె వివరించారు. 'నన్ను కూడా కాల్చేయమని అడిగితే, 'మోదీకి చెప్పుకోండి' (మోదీ కో బోలో) అని అంటున్నారని' ఆమె ఆవేదనతో తెలిపారు. కిందపడిపోయిన వ్యక్తిని సైతం మరోసారి కాల్చారని ఆమె ఉగ్రవాదుల పైశాచికత్వాన్ని వివరించారు. తన భర్తకు ఒకే ఒక్క బుల్లెట్ తగిలిందని, 46 బుల్లెట్లు తగిలాయనే వార్తలు అవాస్తవమని ఆమె స్పష్టం చేశారు. 'మోదీ పాలనలో కశ్మీర్ సురక్షితం అనుకునే వెళ్ళాం. కానీ మాకే ఇలా జరుగుతుందని ఊహించలేదు. మా నష్టాన్ని ఎవరు తీర్చగలరు?' అని ఆమె ప్రశ్నించారు. తమలాగే అనేక కుటుంబాలు బాధితులయ్యాయని, కొందరు పిల్లలకు తల్లిదండ్రులు చనిపోయిన విషయం కూడా తెలియని స్థితిలో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఏ విధంగా సహాయం చేస్తుందోనని ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

మధుసూదన్ కుమారుడు మాట్లాడుతూ, తాము గేటు బయటకు వచ్చిన తర్వాత తల్లిదండ్రుల కోసం ఎదురుచూస్తుండగా, కేవలం అమ్మ మాత్రమే తిరిగి వచ్చిందని, నాన్న రాలేదని చెప్పాడు. చెన్నైలో తన తండ్రి పార్థివ దేహానికి అంతమంది సైనికులు సెల్యూట్ చేయడం చూసి గర్వపడ్డానని, తన తండ్రి కోసం, కుటుంబం కోసం ధైర్యంగా ఉంటానని ఆ బాలుడు పేర్కొన్నాడు.

**నా భర్తను కళ్లెదుటే కాల్చిండ్రు?.. భయానక ఘటనను వివరించిన భరత్ భూషణ్ భార్య..**

జమ్ముకశ్మీర్‌లోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రం పహల్గాం సమీపంలో జరిగిన ఉగ్రవాద దాడి తీవ్ర విషాదాన్ని నింపింది. బైసరన్ లోయ ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన విచక్షణారహితం కాల్పుల్లో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో భరత్ భూషణ్ అనే వ్యక్తి ఉన్నారు. తన మూడేళ్ల కుమారుడిని చూపి కనికరించమని వేడుకున్నా ఉగ్రవాదులు కనికరం చూపకపోవడం అందరినీ కలచివేస్తోంది. సైనిక దుస్తులు ధరించిన కొందరు ఉగ్రవాదులు బైసరన్ లోయలో విహరిస్తున్న పర్యాటకులను చుట్టుముట్టారు. అతి సమీపం నుంచి వారిపై కాల్పులు జరిపారు. ఈ ఊహించని పరిణామంతో పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు.

## ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంటేనే స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తాయి

(మొదటి పేజీ తరువాయి)

వద్దకు వచ్చేందుకు 8 రోడ్లు, 11 పార్కింగ్ ప్రాంతాల్ని గుర్తించినట్లు తెలిపారు. రాజధానిలో మోదీ పర్యటన ఏర్పాట్లను మంత్రి, ఉన్నతాధికారులు పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు అంశంపై స్పందించారు.

''హైదరాబాద్‌లో ఒక ఎయిర్‌పోర్టు ఉంది. అయినా శంషాబాద్ నిర్మించాం. ఇప్పుడు రెండో ఎయిర్‌పోర్టు లేకుంటే హైదరాబాద్‌లో 10శాతం విమానాలు కూడా దిగేవి కాదు. రానున్న 100 ఏళ్లను దష్టిలో పెట్టుకొని సీఎం అమరావతి నిర్మాణం చేస్తున్నారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే అభివద్ధి జరుగుతుంది. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంటేనే స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తాయి. దీనికి అదనపు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్నాం. ప్రజలు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరిస్తే చేస్తాం. లేదంటే భూసేకరణపై ఆలోచిస్తాం. పెరిగిన భూముల విలువ నిలవాలన్నా.. పెరగాలన్నా ప్రజలు ఉండాలి.

# దేశమంతా సమైక్యంగా నిలబడాలి

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. పహల్గాంలో ఉగ్రదాడిలో మతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళి మతదేహాన్ని బుధవారం రాత్రి అధికారులు విశాఖ విమానాశ్రయానికి తీసుకువచ్చారు. చంద్రబాబు అక్కడికి చేరుకొని నివాళులర్పించారు. ఉగ్రమూకల దాడిలో మతి చెందిన చంద్రమౌళి, కావలికి చెందిన మధుసూదనరావు చిత్రపటాలతో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

భారత్‌ను ఏమీ చేయలేరు: 'ఉగ్రమూకల దాడి షాక్‌కు గురి చేసింది. విహారానికి వెళ్లిన పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం తీవ్ర విషాదకరం. చంద్రమౌళితో పాటు వెళ్లిన ప్రత్యక్షసాక్షి శశిధర్ చెప్పినదాన్ని బట్టి చూస్తే ఉగ్రవాదులు అనాగరికంగా, మానవత్వం లేకుండా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. ఆడవాళ్లను వదిలిపెట్టి మగవారినే కాల్చడం చూస్తే ప్రణాళిక ప్రకారం చేసినట్లు అర్థమవుతుంది' అన్నారు. 'దేశంలో సుస్థిర ప్రభుత్వం, సమర్థ నాయకత్వం ఉంది. ఇలాంటి టెర్రరిస్టులు భారత్‌ను ఏమీ చేయలేరు. ఈ తరహా ఘటనలతో అలజడి రేపాలని చూడటం వాళ్ల అవివేకం. క్లిష్టపరిస్థితులు వచ్చినప్పుడు దేశమంతా సమైక్యంగా నిలబడాలి. అందరం మోదీ నాయకత్వంలో కేంద్రం చేసే ప్రతి కార్యక్రమానికీ సంఘీభావం తెలియజేయాలి. దేశ సమగ్రత, సుస్థిరతను దెబ్బతీసేందుకు ఎలాంటి వ్యక్తులు, శక్తులు ప్రయత్నించినా దాన్ని దీటుగా ఎదుర్కొంటామని సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

కుట్రకోణమే..: 'అమెరికా ఉపాధ్యక్షుడు భారత్‌లో, మోదీ విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఈ దాడి జరగడాన్ని కుట్రకోణంగానే భావించాలి. ఎన్డీయే కాదు వివిధ రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజలందరూ ఆలోచించి.. కేంద్రానికి సహకరించాలి. మొదట దేశం.. తర్వాతే ఏ వ్యక్తి అయినా, ఏ ప్రాంతమైనా. దేశానికే సవాలు విసిరేలా ఉగ్రమూకలు ఇలాంటి చర్యలకు పాల్పడినప్పుడు ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకొచ్చి ప్రతిఘటించాలి. ప్రపంచంలో అగ్రదేశాల సరసన భారత్ నిలిచింది. 2028 నుంచి మరింత వేగంగా అభివద్ధి చెందనుంది. అందుకే కొన్ని శక్తులు దేశంలో అలజడి సష్టించాలని కుట్రపన్నాయి' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రజల జీవితాలతో ఆడుకుని దేశాన్ని బెదిరించాలని, సమగ్రతను దెబ్బతీయాలనుకునే వాళ్లకు గట్టిగా సమాధానం చెబుతాం. అదే సమయంలో ప్రజలే పోలీసింగ్ చేయాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు పరిష్కారమవుతాయి. ఏపీలో సముద్ర తీరం ఎక్కువగా ఉంది. భద్రతపై దష్టి పెట్టాం. అనుమానం వచ్చినప్పుడు ప్రజలు బాధ్యతగా ఇంటెలిజెన్స్, పోలీసు వర్గాలకు తెలియజేయాలి' అని చంద్రబాబు కోరారు.

**రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం**

'ఉగ్రవాదుల కాల్పుల్లో రాష్ట్రానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూదనరావును పోగొట్టుకున్నాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. ఏపీ ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చొప్పున సాయం చేస్తాం. మతుల ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రె మంత్రి అనిత, విశాఖ ఎంపీ శ్రీభరత్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డీబీవీ స్వామి, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకష్ణ, విష్ణుకుమార్‌రాజు, రామకష్ణబాబు, రమేష్‌బాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులున్నారు.

# అసోంలో ఎమ్మెల్యే అరెస్ట్

**పాకిస్తాన్‌ను సమర్థిస్తూ వీడియో**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటనలో పాకిస్థాన్‌ను సమర్థిస్తూ, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఏఐయూడీఎఫ్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాంను అసోం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆయనపై దేశద్రోహం అభియోగాలు మోపారు. ఈ అరెస్టుకు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆదేశించారు. గౌహతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. 'సంబంధిత ఎమ్మెల్యే పహల్గాం దాడి వ్యవహారంలో పాకిస్థాన్ను సమర్థించినట్లుగా ఉన్న ఒక వీడియోను మేము సమీక్షించాం. దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించాను. ఆయనను అరెస్ట్ చేసినట్లు డీజీపీ ధృవీకరించారు' అని హిమంత బిశ్వశర్మ తెలిపారు. ధింగ్ నియోజకవర్గ శాసనసభ్యుడైన అమినుల్ ఇస్లాంను న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సరైన రీతిలో ముగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాం చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో ఆధారంగా అసోం పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఈ వీడియోలోని అంశాలు ప్రజల మధ్య అశాంతిని రేకెత్తించేలా, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసేలా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ అరెస్ట్‌పై అసోం పోలీసులు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రజలను తప్పుదోవ పట్టించేలా, రెచ్చగొట్టేలా ధింగ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాం చేసిన ప్రకటన వైరల్ అయింది.దాని ప్రకారం ఆయనను అరెస్ట్ చేయడం జరిగింది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 'కూటమి ఏడాదిపాలన అస్తవ్యస్తం'

- సిపిఎం మాజీ పార్లమెంట్ సభ్యులు పి మధు...

**తిరుపతి, ఏప్రిల్ 24 మనం న్యూస్ :** మరో మాసం గడిస్తే ఏడాది పూర్తి చేసుకోనున్న కూటమి పాలన అస్తవ్యస్తంగా తయారైందని అవినీతి, అశ్రితపక్షపాతం రాజ్యమేలుతున్నాయని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు.

తిరుపతి ప్రెస్ క్లబ్ లో గురువారం నాటి ఉదయం జరిగిన మీడియా సమావేశంలో సిపిఎం నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'అయినవారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో' రీతిన పాలన సాగుతున్నదని, ఎన్నో ఆకాంక్షలతో ఎపి ప్రజలు గొప్ప విజయాన్ని కూటమికి చేకూరిస్తే ఆశలను ఆవిరి చేస్తున్నదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అమలవుతున్న తీరుకు సంబంధం లేకుండా పోయిందని అన్నారు.

ఇసుక, మద్యం, మైనింగ్, విద్యుత్ తదితర రంగాలలో అవినీతి దందాలు అదుపుతప్పి పోయాయని ఆరోపించారు. ఎంఎల్ఎలు, మంత్రులు ప్రతి పనికి లెక్కలు కట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయని విమర్శించారు.

ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడు



రాష్ట్రంలో కరువయ్యారని. ప్రభుత్వ కార్యకలాపాలలో అవినీతి తాండవిస్తున్నదని ఆరోపించారు.ప్రతి బదిలీకి పాలకులు డబ్బులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతిని నియంత్రించే పరిస్థితి కొరవడిందన్నారు.

ప్రజల చేతిలో డబ్బులు లేవని, కొనుగోలు శక్తి పడిపోయిందని, కష్టజీవులకు వేతనాలు పెరగడం లేదని, ఆఖరుకు కనీస వేతన జిఓలు సవరించి 15 ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వీరు 70 లక్షల మంది ఉంటారన్నారు.

అమరావతి, పోలవరం చుట్టూ మాట్లాడటం తప్ప మిగిలిన రాష్ట్రం ఒకటుందన్న వాస్తవాన్ని పాలకులు మరిచిపోయినట్టున్నారని,రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం వంటి వెనుకబడిన జిల్లాల గురించి గడిచిన ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సమీక్ష చేయకపోవటం, కేటాయింపులు లేకపోవటం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తున్నదని అన్నారు.

రాష్ట్రంలో ప్రజలు తాగునీరు, ప్రాజెక్టులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సమస్యలతో ఉన్నారని తెలిపారు.నిత్యావసర వస్తువుల ధరలు బియ్యం, నూనె, పప్పులు వంద శాతం కు పైగా పెరగటం వల్ల సామాన్యులు కొనుగోలు శక్తి లేక అల్లాడిపోతున్నారని తెలిపారు. ఇటీవల సిపిఎం నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో అనేక సమస్యలు వెల్లడయ్యాయని వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షల పేరిట ప్రతిరోజూ పటాటోపం ప్రదర్శిస్తున్నారని, ఉప ముఖ్యమంత్రి గందరగోళంలో ఉంటూ, ప్రజలను గందరగోళ పరుస్తున్నారని అన్నారు.గత వైపిపి పాలనలోనూ, ప్రస్తుత కూటమి పాలనలోనూ బిజెపి చెప్పుచేతుల్లో రాష్ట్రం నడుస్తున్నందువల్లే సమస్యలు తారాస్థాయికి చేరాయని వ్యాఖ్యానించారు.

అదానీకి విద్యుత్ రంగాన్ని అప్పజెప్పారని, అదానీకి సబ్-కాంట్రాక్టరుగా కడపకు చెందిన షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీ గతంలోను, ఇప్పుడు రాష్ట్రంలో పనులు చేపడుతూ అక్రమాలకు పాల్పడుతున్నదని అన్నారు.

ఈ సంస్థ నుంచి ఎన్నికల బాండ్లు తీసుకుని చంద్రబాబు ప్రభుత్వం జరుగుతున్న విధ్వంసానికి కారణమవుతున్నదని విమర్శించారు. డిస్కంలు తాజాగా చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసుకోవలని పెనుమల్లి మధు డిమాండ్ చేశారు.కాశ్మీరు ఘటనలో అమాయకులైన 28 మంది భారతీయ పౌరులు అన్యాయంగా చంపబడ్డారని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు.

## రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి సాదర స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్



**రేణిగుంట, ఏప్రిల్ 24 మనం న్యూస్ :** పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్ దుర్ఘటనలో అసువులు బాసిన కావలిలోని మధుసూదన్ రావు గారి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం విశాఖ పట్నం వెళ్ళే నిమిత్తం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నగౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి సాదర స్వాగతం పలకగా వారు విమాన మార్గం ద్వారా విశాఖ పట్టణానికి ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు.

## ముస్లిం ముష్కరులారా ఖబడ్దార్..!

- పాక్ ఉగ్రవాద చర్యలకు మూల్యం తప్పదు
- హిందూ బంధువుల ఐక్యత ఆవశ్యం
- ప్రాణాలు కోల్పోయిన భారతీయులకు ఘన నివాళి

**తిరుపతి,ఏప్రిల్ 24 మనం న్యూస్ :** కాశ్మీర్ లో జరిగిన పాక్ ఉగ్రవాద ముస్లిం ముష్కరుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయులకు రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ఘన నివాళి అర్పించింది. ముస్లిం ఉగ్రవాద కిరాతకులు అతి దారుణంగా హిందూ బంధువులను ఏరి కోరి చంపడం అతి దారుణమని, ఇందుకు పాక్ మూల్యం చెల్లించక తప్పదని ఆర్ హెచ్ వి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల,జిల్లా అధ్యక్షులు సుందర కుమార్ రాజు, ఉపాధ్యక్షులు సిరిగిరి శంకర్ రాజు, హేమంత్ రాజు, మాధవ రాజు తదితరులు హెచ్చరించారు. రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్ లోని ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పాక్ ముష్కరుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన హిందూ బంధువులకు అశ్రు నివాళులు అర్పించారు.



ప్రస్తుతం హిందువుల ఐక్యత ఆవశ్యకతను, అవసరాన్ని వివరిస్తూ ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించారు. పహల్ గాం లో జరిగిన పాకు ఉగ్రవాద చర్య అతి కిరాతకమైనదని, మానవ మాత్రులు క్షమించరాదని, పర్యాటకుల గుర్తింపు కార్డులు చూసి హిందువులని నిర్ధారించుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్న ముస్లిం ముష్కరులకు తగిన గుణపాఠం తప్పదని ఆర్ హెచ్ వి ఎస్ ప్రతినిధులు ఉద్ఘాటించారు. భారతదేశంలో మోడీ, యోగి ద్వయంతో పాక్ తోక ముడువక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు భారతదేశంలో పునరావృతం కాకూడదని భగవంతుని ప్రార్థిస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ప్రతినిధులు మాధవ రాజు, హేమంత్ రాజు, వెంకటేశ్వర్లు రాజు, లోక్ సింగ్ షణ్ముగం, సాల్వ వెంకట మునిరాజు,భరత్,భాస్కర్ రాజు, ఎల్ఐసి శ్రీనివాసులు, చిన్నప్ప రాజు, నీరజ, పద్మజ, సాయి, భార్గవి, మనోహర్ యాదవ్,గురు ప్రసాద్, వాణి తదితరులు పాల్గొన్నారు.

## తీవ్రంగా కలచివేసిన పహల్గాంలో ఉగ్రదాడి ఘటన

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, ఏప్రిల్ 24 మనం న్యూస్ః జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ట్రెక్కింగ్లో ఉన్న పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసిన ఘటన కాశ్మీర్ నే గాక దేశాన్నే కుదిపేయడం పై గురువారం ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య ఆయన ఖండించారు. ఈ దాడిలో 30 మంది చనిపోవడం, మరికొంత మంది గాయపడటం తనను బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మృతుల కుటుంబాలకు



తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు తెలియజేశారు.

ఈ దాడిలో మరణించిన వాళ్లలో ముగ్గురు తెలుగు వాళ్లు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలబడం అభినందనీయమన్నారు. అలాగే ఉగ్రవాదం పై పోరుకు యావత్ దేశం కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## యూట్యూబ్లో అన్నమయ్య సంకీర్తనలు

- టీటీడీ ఈవో జె.శ్యామలరావు

**తిరుపతి, ఏప్రిల్ 24 మనం న్యూస్ః** పద కవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను ప్రజలందరికీ, ముఖ్యంగా యువతకు యూట్యూబ్ ద్వారా చేరువచేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో ఈవో, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఇప్పటికే పరిష్కరించబడిన అన్నమయ్య సంకీర్తనలను ఎస్వీబీసీ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వేసవి సందర్భంగా టిటిడి స్థానిక ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలుగకుండా, భక్తుల అధిక రద్దీ



నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై జేఈఓ వీర బ్రహ్మంకు పలు సూచనలు చేశారు. టిటిడి ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలోని వివిధ ప్రాజెక్టులో జరుగుతున్న కార్యక్రమాలపై అధికారులతో ఆయన చర్చించారు.

అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్, విద్యా, వైద్యం, తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వేద విశ్వవిద్యాలయం విసి రాణి సదాశివమూర్తి, ఎఫ్ ఎ అండ్ సిఎవో బాలాజి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలలో భద్రతా దళాల మాక్ డ్రిల్

**తిరుపతి, ఏప్రిల్ 24 మనం న్యూస్ :** కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను లేపాక్షి సర్కిల్ వద్ద ఉన్న సుదర్శన్ సత్రంలో గురువారం సాయంత్రం భద్రతా దళాల మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు.



అదనపు ఎస్పీ శ్రీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై టీటీడీ నిఘా మరియు భద్రతా, సివిల్ పోలీసులకు, రిజర్వ్ పోలీసులకు, ఆలయ సిబ్బందికి, వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు.

అసాల్ట్ డాగ్ ఎనిమీ ఎటాక్, రూమ్ ఇన్టర్వెన్షన్ కార్యకలాపాలు చేసి చూపారు. దాదాపు ఒకటిన్నర గంటపాటు ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఈ మాక్ డ్రిల్ 28 మంది ఆక్టోపస్ కమాండోలు, 25 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 10 ఏపీఎస్పీ సిబ్బంది ఈ మాక్ డ్రిల్ లో భాగమయ్యారు.

ఈ కార్యక్రమంలో వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, డీఎస్పీ విజయ శేఖర్, ఏవిఎస్ఓలు, పోలీసు, ఆక్టోపస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## యువత సన్మార్గంలో నడవాలి


- జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

**తుంగతుర్తి ఏప్రిల్ 24, ( మనం న్యూస్ )ః** గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,యువతను సన్మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం అని జిల్లా అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ గ్రామానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజలపై ఉందన్నారు.ఒకరికొకరికి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని అన్నారు,అంతే కానీ గొడవల జోలికి వెళ్ళితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామంలోని ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ముఖ్యంగా నేడు యువత చెడు మార్గంలో ప్రయాణిస్తుందని డ్రగ్స్,గంజాయి,సైబర్ క్రైమ్,బెట్టింగ్ లకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. దీనివల్ల వారి జీవితాలు చెడిపోవడం కాకుండా తల్లిదండ్రులు అవమానాలకు గురికావాల్సి వస్తుందని అన్నారు.



అందుకే యువత సన్మార్గంలో ప్రయాణించాలని హితువు పలికారు.ఈ సందర్భంగా గంజాయి ఆన్లైన్ మోసాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరసింహారావు,ఎస్సై క్రాంతి కుమార్, స్టేషన్ సిబ్బందితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన యెల్లౌల సంజీవరెడ్డి



**మోటకొండూర్, ఏప్రిల్ 24 (మనం న్యూస్):** మోటకొండూరు మండలంలోని తెర్యాల గ్రామనికి చెందిన నల్ల కృష్ణవేణి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లౌల సంజీవరెడ్డి.

ఈ కార్యక్రమంలో తన వెంట తెర్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పంజల రాజు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగు పుల్లయ్య, వాకిటి విమల,ఇరుకుల సునీత, నల్ల యాదగిరి, భూరెడ్డి సుధాకర్ రెడ్డి, మంత్రి శంకరయ్య, పంజల రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 28న చలో కలెక్టరేట్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**మోటకొండూర్, ఏప్రిల్ 24 (మనం న్యూస్)ః** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా సమస్యల సాధనకై ఈనెల 28న చలో కలెక్టరేట్ సిపిఎం పాదయాత్ర మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ పిలుపును ఇచ్చారు. గురువారం రోజున మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే సిపిఎం పార్టీ పాదయాత్ర సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయం నుండి పెద్ద ఎత్తున మహాధర్నను కలెక్టరేట్ ముందు జయప్రదం చేయాలని, కరపత్రాన్ని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మరియు జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ విడుదల చేసి మాట్లాడుతూ, పాలకులు మారుతున్నారు కానీ పాలనా తీరు మారడం లేదని, ప్రజా సమస్యలపై సమగ్ర ప్రణాళిక లేక అనేక ప్రజా సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో చేపట్టవలసిన సమస్యలను ఏళ్ల తరబడి నాన్చుతున్నారని, జిల్లాలో సాగునీటి సమస్య కీలకంగా ఉన్నదని బస్వాపురం రిజర్వాయర్ పనులు రెండు దశాబ్దాలు కావస్తున్న ఇంతవరకు పూర్తి కాలేదని, ప్రజా ఆందోళనల వల్ల మంజూరైన ధర్మారెడ్డి పల్లి పిల్లాయి పల్లి పునాది గాని కాల్వ పనులు ఎంత కాలానికి పూర్తి అవుతాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలువలు తవ్వి ఏళ్లు గడిచిన నీళ్లు ఎందుకు పారడం లేదని, షామీర్పేట ను రీర్వాయర్ చేసి బొమ్మలరామారం తుర్కపల్లి భువనగిరి ప్రాంతాలకు నీరిస్తామని ఏళ్ల తరబడి పోరాడిన పాలకులను ఏమని సంబోధించాలని, పెండింగ్ సమస్యలు కారణం నిర్లక్ష్యమేనని అన్నారు.



జిల్లాలో పలుచోట్ల భూ సమస్యలు ఉన్నాయని గత 10 సంవత్సరాలుగా ఏ ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వలేదు. ఇంటి స్థలాల కోసం ప్రజలు ఆందోళనల బాట పడితే సానుకూలంగా వివరించకుండా పోలీసుల బెదిరింపులు అరెస్టులు చేస్తున్నారని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అతీగతి లేక మూలుగుచున్నవని, కొన్ని గ్రామాల్లో రేషన్ షాపులకు దూరంగా వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామాలలో లింకు రోడ్లు అంతర్గత రోడ్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం పార్టీ జిల్లాలో సరైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని సిపిఎం పార్టీ పిలుపు అందుకొని ప్రజలు పెద్ద ఎత్తున ఈ మహా దర్నాను జయప్రదం చేయాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ బట్టుపల్లి అనురాధ ,జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు, మద్దెల రాజయ్య, సిరిపంగి స్వామి, రచ్చ గోవర్ధన్, వేముల బిక్షం, గాజుల ఆంజనేయులు, పల్సం స్వామి, రాగిరి కిష్టయ్య, సీసా శ్రీనివాస్, వడ్డే బోయిన మహేందర్, చెరుకు అనిల్, మొగిలిపాక నరసింహ, మల్లేష్, కొల్లూరి ఐలయ్య, తాడబోయిన యాదయ్య, నరసింహ, బందెల పోచయ్య, వరప్రసాద్, నాగరాజు, బోగారం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టెడ

మిత్రుని ఫోన్ కాల్తో బయటికి వెళ్తుంటే
గబుక్కున ఆగాను పట్టెడ
ఐదుగజ్జల పట్టెడ కిందపడి ఉంది
అల్మారా నుండి
ఏ కొత్తబట్టలు తీస్తుంటే
ఏ సర్టిఫికెట్లు చూస్తుంటే
పడిందో ఏమో పట్టెడ
మెడకి అలంకరించే ఆభరణం కాదది
ఒక్క మెరిసే ఆభరణమే కాదది
ఆ పట్టెడ మామూలుది కాదు
కొంత విలువ కొంత పవిత్రతతో
పాడుభూమిని చదునుచేసి
సాగుచేసినట్టు
మా పాడు బతుకుల్ని
పదనుచేసి బాగుచేసి
ఎన్నిసార్లు షావుకారి ఇనుపగదిలో
బంధిఖానా అయ్యిందో పట్టెడ
సగం జైలు సగం బెయిలు దానిది
మాది కుదుటపడ్డ గోపురం కాదు
కుదువపెట్టే కాపురం
ఏ అవసరాలు పిలిచినా
ఆపద్బాంధవమైన పట్టెడ
ఏ అరణ్యాలు మొలిచినా
ఆయుధమైన పట్టెడ
బంగారు పట్టెడ
అమ్మ శరీరాన్ని ముద్దాడిన పట్టెడ
సెలయేళ్ళుగా మారిన
మాకన్నీళ్లను తుడిచిన పట్టెడ
చేతిలోకి తీసుకొని పట్టెడ చూస్తుంటే
కన్నీటి సరస్సులో వికసించిన
పద్మంలా అగుపించిన అమ్మ
బాల్యపు జాడల్లోంచి
యవ్వనపు నీడల్లోంచి
కరిగిన కలలో మెరిసిన
వజ్రంలా కనిపించిన అమ్మ
ఇప్పుడన్నీ వున్నాయి
ఉద్యోగం హోదా
ఇప్పుడన్ని వున్నాయి
ఆస్తి అంతస్తూ
లేనిది అమ్మవొక్కతే

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# భూమిని మనమే కాపాడుకుందాం




సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. ఇది ప్రపంచ ఉపరితల వైశాల్యంలో 29.1శాతాన్ని ఆక్రమించి కోట్లాది జీవ జాతులకు నివాసయోగ్యమైనది. గాలి, నీరు, నేలతో ఆవరించిన భూమి 'సహజ వనరుల' గని. దీనిపై జీవుల పుట్టుక దాదాపు 350 కోట్ల ఏళ్ల క్రితం జరిగిందని, ధరిత్రి ఇప్పటి స్థితికి రావడానికి దాదాపు 460 కోట్ల సంవత్సరాలు కాలం పట్టిందని శాస్త్రవేత్తల అంచనా. భూమిపై మానవ అనాలోచిత చర్యల ఫలితంగా జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న లక్ష్యంతో పాటు పర్యావరణం పట్ల స్పృహ కలిగి ఉండడానికి ప్రతి ఏటా 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం' నిర్వహించడం జరుగుతుంది. పారిశ్రామీకరణ, పట్టణీకరణ వలన పెరుగుతున్న కాలుష్యం, పర్యావరణ అంశాలను దృష్టిలో పెట్టుకుని అమెరికన్ సెనేటర్ గేలార్డ్ నెల్సన్ ధరిత్రి దినోత్సవానికి రూపకల్పన చేశారు. దీనిని మొట్టమొదటిసారి అమెరికాలో 1970 ఏప్రిల్ 22న నిర్వహించారు. అనంతరం ఇది ప్రపంచ దేశాలకు వ్యాప్తి చెందింది. ప్రపంచ స్థాయిలో ధరిత్రి సంరక్షణ పట్ల మరింత అవగాహన కలిగించి, భూగోళాన్ని సంరక్షించడానికి 'ఎర్త్ డే నెట్‌వర్క్' కూడా ఏర్పడింది. ఐక్యరాజ్యసమితి 2009లో ఈ ధరిత్రి దినోత్సవానికి ఆమోదం తెలిపి దీనిని 'ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ డే'గా మార్చింది. ఈ ఏడాది ధరిత్రి దినోత్సవం 'మన శక్తి, మన గ్రహం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. 2030 నాటికి పునరుత్పాదక వనరుల నుండి ప్రపంచ విద్యుత్ ఉత్పత్తిని మూడు రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఈ నినాదం ప్రాధాన్యత సంతరించుకున్నది.

నేడు ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న అనేక కార్యకలాపాలు భూమి కాలుష్యానికి దారితీస్తుంది. శిలాజ ఇంధనాలు విచ్చలవిడిగా వాడడం వల్ల గ్రీన్ హౌస్ వాయువులు విడుదలై వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవిస్తున్నాయి. తద్వారా భూగోళం వేడెక్కి హిమాని నదులలో మంచు కరిగి వరదలు సంభవిస్తున్నాయి. దీంతో నేల కోతకు గురికావడం, కరువులు తాండవించడం జరుగుతుంది. అడవుల నరికివేత, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు, అణుశక్తి వలన రేడియోధార్మిక పదార్థాలు భూమిలోకి ప్రవేశించడం వలన నేల కాలుష్యానికి గురవుతుంది. వరల్ అట్లాస్ ఆఫ్ డెసర్టిఫికేషన్ ప్రకారం 75 శాతం నేలలు ఇప్పటికే క్షీణించాయి. ఇది 320 కోట్ల ప్రజలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపనుందని యునెస్కో పేర్కొన్నది.

2050 నాటికి, భూ గ్రహం యొక్క 90 శాతం వరకు నేల క్షీణించవచ్చని సంస్థ హెచ్చరించింది. ఇది ఇలా ఉంటే ఇటీవల పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా తప్పుకోవడం ఆందోళనకరం. దీన్ని పునసమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ ప్రకారం, భారతదేశంలోని దాదాపు 30 శాతం నేల క్షీణించింది. ఇది వ్యవసాయం మరియు ఆహార భద్రత పైన తీవ్ర ప్రభావం చూపనుంది. వాయు కాలుష్యం పెచ్చుమీరడం మూలంగా ఓజోన్ పొర కూడా రోజు రోజుకు దెబ్బతినడం జరుగుతుంది. తద్వారా అతి నీలలోహిత కిరణాలు భూమి పైకి చేరి జీవరాసులకు నష్టం వాటిల్లుతుంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడడం మూలంగా పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన భూమి నిస్సారంగా మారిపోయింది. ప్రస్తుతం ప్లాస్టిక్ మరియు చెత్త కూడా భూ కాలుష్యానికి ప్రధాన కారణంగా నిలుస్తుంది. ముఖ్యంగా ప్లాస్టిక్, లోహ మరియు ప్యాకేజీ తదితర వ్యర్థ పదార్థాల పరిమాణం కూడా విపరీతంగా పెరిగింది. విచ్చలవిడి గనుల తవ్వకం వలన పర్యావరణ సమతుల్యతఛదెబ్బతింటుంది. ముఖ్యంగా గనుల తవ్వకం వలన దట్టమైన అడవులు అంతరించిపోవడంతో పాటు దాని నుంచి వెలువడే దుమ్ము, దూళి వల్ల గాలి, నీరు, నేల కాలుష్యానికి గురికావడం జరుగుతుంది. ఇలా మానవ చర్యల ఫలితంగా జీవ వైవిద్యం సైతం పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటూ, మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో భారత విద్యా మంత్రిత్వ శాఖలోని పాఠశాల విద్య అక్షరాస్యత విభాగం ఈ సంవత్సరం ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ లైఫ్ కోసం ఎకో క్లబ్ ద్వారా వృక్షజాలం కోసం క్యూఆర్ కోడ్ లు' అనే విద్యా కార్యక్రమాన్ని ప్రారంభించింది. తెలంగాణలోని అన్ని పాఠశాలలు తమ పర్యావరణ విద్యా కార్యక్రమాలలో దీన్ని అమలు చేయనున్నారు. పాఠశాల ఆవరణంలో చెట్ల కోసం ఖఖ కోడ్ ను రూపొందిస్తారు. ఇది పర్యావరణ అభ్యాసాన్ని డిజిటల్ నైపుణ్యాలతో కలిపే సృజనాత్మక మరియు ప్రభావవంతమైన విధానం. ఈ ఖఖకోడ్ లో చెట్టు పేరు, జాతులు, లక్షణాలు మరియు ప్రయోజనాల గురించి సమాచారాన్ని తక్షణమే పొందేలా చేస్తాయి.

ప్రస్తుతం పెరుగుతున్న జనాభా అవసరాలకు తీరుస్తూ భూగోళ సుస్థిరతకు చర్యలు చేపట్టాలి. ఇందులో భాగంగా సుస్థిర వ్యవసాయోత్పత్తికి, అడవుల యాజమాన్యానికి, నేలకోత నివారణకు, నీటి కాలుష్య నియంత్రణకు చర్యల చేపట్టాలి. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ, ఉత్పాదకత పెంచే సేద్య విస్తీర్ణంపై పరిశోధనలు జరగాలి. పర్యావరణానికి హాని కలిగించే శిలాజ ఇంధన వనరులకు బదులుగా పునరుత్పాద ఇంధన వనరులైన పవన, సౌర, బయోగ్యాస్, బయోమాస్, హైడ్రోజన్ శక్తి, సముద్ర తరంగ శక్తి మరియు జీవ ఇంధనాలపై దృష్టి పెట్టాలి. భూమి కాలుష్యానికి పెనుముప్పుగా తయారైన ప్లాస్టిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి. ప్లాస్టిక్ బదులు భూమిలో కలిసిపోయే జనుము, గోగునార లాంటి ప్యాకింగ్ వస్తువుల వినియోగాన్ని తీసుకురావాలి. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధ నిబంధలు కఠినంగా పాటించాలి. పట్టణ ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ సక్రమంగా చేయాలి. ఘన వ్యర్థ పదార్థాలను పున: చక్రియ ప్రక్రియ ద్వారా కంపోస్ట్ మరియు జీవ ఎరువులను తయారు చేయాలి. వ్యవసాయంలో రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం నేల సారాన్ని పరీక్షించడానికి సాయిల్ హెల్త్ కార్డులను తీసుకురావడం జరిగింది. వీటి పట్ల రైతులకు అవగాహన కల్పించాలి. పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించాలి. పరిశ్రమల నుంచి విషపూరిత వ్యర్థాల విడుదలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు నియంత్రించాలి. ఉపాధ్యాయులు బాల్య దశ నుంచే భూగోళ సంరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పాఠ్యాంశాల్లో ధరిత్రికి సంబంధించిన పాఠ్యాంశాలను చేర్చాలి. అంతేకాకుండా విద్యార్థులకు ధరిత్రికి జరుగుతున్న నష్టాన్ని క్షేత్రస్థాయి పర్యటనలు, కృత్యాల ద్వారా వివరించాలి. అప్పుడే భవిష్యత్ తరాల కోసం భూగోళం రక్షించబడుతుంది.



**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428


# ఒత్తిడికి గుండె ఎందుకు ఓడిపోతుంది?



ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో జీవితం సాంకేతికంగా సౌకర్యవంతంగా మారిందనుకునే సమయంలో, మనసు మాత్రం మరింత భారంగా మారుతోంది. రోజూ ఎదురయ్యే పని బారాలు, సంబంధాల అర్థం పర్థం లేని ఒత్తిళ్లు, సామాజిక మీడియా ప్రభావం, మరియు నిరంతరమైన 'ప్రదర్శన' కృషి ఇవన్నీ కలిసి మన ఆత్మస్థైర్యాన్ని నెమ్మదిగా హరిస్తున్నాయి. చాలా మంది నిద్రలేమితో,ఆలోచనల వణుకుతో, అప్రయత్న ఆగ్రహంతో బాధపడుతున్నారు. కానీ దీన్ని ఎవరూ మానసిక సమస్యగా గుర్తించాలనే ఆలోచన చేసుకోవడం లేదు. ఎందుకూ తెలియని ఉక్కిరిబిక్కిరి నిదానంగా నశిస్తున్న మన లోకపు లోపలి బాధ. ఎంతో బరువు మోయగల హృదయం... ఒత్తిడికి ఎందుకు ఓడిపోతుంది? మనశ్శక్తికి పరిమితి లేదు అనుకుంటూ, మౌనంగా తిప్పుకొంటున్న మానసిక బాధలకు గళం ఇవ్వాల్సిన సమయం ఇది

ఒత్తిడిని ఎదుర్కొనడంలో శరీరం ఫైట్ లేదా ఫ్లయిట్ ప్రతిస్పందనను ప్రదర్శిస్తుంది. ఇది తాత్కాలికంగా సహాయపడినా దీర్ఘకాలంలో మన నరాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది కొంతమందిలో బర్నౌట్ సిండ్రోమ్ కి, మరికొంతమందిలో ఆత్మహత్యల ఆలోచనలు కి దారితీస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగస్తులు, మరియు మహిళలు ఒత్తిడికి ఎక్కువగా లోనవుతున్న సమూహాలలో ఉంటున్నారు. అయినప్పటికీ, వారు మానసిక నిపుణలను కలవడాన్ని అవమానంగా భావించడం మన సమాజంలో ఇప్పటికీ బలంగా ఉంది.

మానసిక ఆరోగ్యం సరైన మద్దతు లేకుండా వదిలేస్తే అది వ్యక్తిగతంగా కాక సమాజపరంగా కూడా ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. అధిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తులు తమను తాము గౌరవించలేకపోతారు, ఇతరులను నమ్మలేరు, మరియు అసూయ, క్రోధం, నిస్పృహ వంటి భావోద్వేగాలను అదుపులో పెట్టలేరు. ఇది కుటుంబ సంబంధాలను భంగపరుస్తుంది, పనితీరు దెబ్బతీస్తుంది, చివరకు జీవితం విలవిల్లాడే స్థితికి చేరుతుంది.



ముందుచూపు దిశగా - మార్పు అవసరం!

ఒత్తిడిని ఎదుర్కొనడం అంటే కేవలం ధైర్యం చెప్పడం కాదు. ఆత్మవిశ్లేషణ, స్వీకార సామర్థ్యం, ప్రొఫెషనల్ సహాయం. ఇవే దీని తాలూకు పరిష్కార మార్గాలు. మానసిక నిపుణలను కలవడంలో ఎలాంటి సందేహం ఉంచుకోవాల్సిన అవసరం లేదు, అది చైతన్యానికి నిదర్శనం. కౌన్సెలింగ్, సైకోథెరపీ, అవసరమైతే మందులు ఇవన్నీ మన బలహీనతలను తగ్గించేందుకు కాదు, మన బలాన్ని తిరిగి పొందేందుకు ఉన్నాయి అని గుర్తుంచుకోవాలి. మనసు అనేది శరీరానికి మార్గదర్శకమైన అస్త్రం. దాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే మన పునాదులనే లెక్కచేయకపోవడం. ఇప్పుడు మన చేతుల్లో ఉన్న ముఖ్యమైన మార్పు మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడం, మౌనం తొలగించడం, సహాయం కోరడాన్ని స్వీకరించడం.

మనసు ప్రశాంతంగా ఉంటేనే, శరీర ఆరోగ్యం

ఈ ప్రపంచం పరిగెత్తుతోందని మనం కూడా అలాగే పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. మన ఆరోగ్యం ముందు దారితప్పిన ప్రదర్శనలు ముఖ్యం కాదు. ఒత్తిడిని చిన్నచూపు చూడకండి ఇది శరీరం కన్నా ముందుగా మనసును గాయపరుస్తుంది. అవసరమైతే సహాయం కోరండి. మన జీవితం విలువైనది. మనసు ప్రశాంతంగా ఉంటేనే, శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అదే నిజమైన విజయం.

**- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

# జంతువులకు హక్కులు లేవా!



రాజ్యాంగాలు మానవాళికి స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించాయి. తన మనుగడ కోసం ఏ పనికైనా సిద్ధం అంటున్నాడు నవ్య నరుడు. మనిషికి మనిషే శత్రువుగా మారాడు. పశుత్వం నిండిన మనిషి జంతువుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నాడు. తన స్వార్థం కోసం ఎంత దూరమైనా వెళ్లగలడు. ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు లేదా అధ్యయనాల పేరుతో మిలియన్ల సందర్భంగా మిలియన్ల కొద్ది మూగ జీవులపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి మిలియన్ల కొద్ది జంతువుల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. జంతువులపై ప్రయోగాలు పూర్తి అయిన తర్వాతనే ఆ ఔషధాలను మానవ వాడకానికి అనుమతిస్తారు. నేటికీ అనేక ప్రయోగశాలల్లో ఎలుకలు, కుందేళ్లు, పిల్లలు, కుక్కలు లాంటి అమాయక జీవులు బోనుల్లో మగ్గుతూనే ఉన్నాయి. కప్పలు, బొద్దింకలు, వానపాములు, పలు జంతువులను డిసెక్షన్ చేసి వాటి లోపలి అవయవ భాగాలను అధ్యయనం చేయడం గత తరం జంతుశాస్త్ర విద్యార్థులకు



తెలిసిన అనుభవమే. ప్రపంచ ప్రయోగశాల జంతువుల దినం వేదికగా అవగాహన కల్పించడం, జంతువులపై ప్రయోగాలకు బదులుగా సరైన ప్రత్యామ్నాయాలు వెతకడం, జీవ కారుణ్య భావనలను విస్తరించడం, మానవీయ కోణంలో ఆలోచనలు చేయడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ఇలాంటి జీవ హింసకు బదులుగా శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జంతువులు లేకుండానే ప్రయోగాలను పూర్తి చేద్దాం, మానవత్వాన్ని కాపాడుదాం.

అమాయక జంతువుల ఉసురుపోసుకుంటూ, ప్రయోగాల మిషతో చంపడం అనాదిగా కొనసాగుతున్నది. ఈ విధం అమాయక మౌనజీవులను ప్రయోగశాలల్లో వినియోగిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఏట 24 ఏప్రిల్ రోజున ప్రపంచ ప్రయోగశాల జంతువుల దినం లేదా వరల్ డే ఫర్ లాబొరేటరీ ఆనిమల్స్ అనబడే కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

మనం నిత్యం వాడుతున్న ఔషధాలు, క్రిమిసంహారకాలు, ఏవియేషన్, యుద్ధ క్షేత్రాలు, కాస్మొటిక్స్, బాత్రూం క్లీనర్స్ ఆవిష్కరణల సందర్భాల్లో పరిశ్రమలు/ప్రయోగశాలలు అనేక రకాలైన పరీక్షలు, ప్రయోగాలు చేస్తారు. ఈ

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## మారుతారా?
## మీరు ఇకనైనా మారుతారా?

ఓటు బ్యాంకు రాజకీయాలకోసం
కులాల చిచ్చు,మతాల చిచ్చు...
మౌనంగా ఏదైనా భరిస్తాం కానీ....

మరణమొచ్చినా మారేది లేదంటారా?
భిన్నత్వంలో ఏకత్వం ఎక్కడికి పోయింది...
ఈ నేల నెత్తురోడిన ప్రతిసారి ఇవే ప్రశ్నలు....

అప్పటిదాక కలిసున్న రాం-రహింలకు చిక్కులు...
ఎవడి జీవనం వాడిది,ఎవడి అభిమతం వాడిదే...
మరి కలిసుండాలంటే ఒకరినొకరు గౌరవించుకోవాల్సిందేగా...

ఇఫ్తార్ విందు ఇచ్చే నాయకులకు హిందువులు గుర్తుకురారా?
పీర్ల మసీదులో ఆడినా,పాడినా... దర్గాలను దర్శించుకున్నా...
రహీం గుడిలోకి రాడెందుకు? ఈ మధ్యన చెలరేగుతున్న ప్రశ్నలు...

ఎవడి కులం గొప్పది... ఎవడి మతం గొప్పదీ అంటూ...
భారతీయ ఐక్యతకు తూట్లు పొడుస్తుంటే...
అవకాశ వాదులు చూస్తు ఊరుకుంటారా?

ఐక్యతే లేకపోతే అమాంతం తన్నుకు పోరా??
ఈ ప్రశ్నలకు బదులు వెతుకుతూ ఇలాగే జీవిద్దామా?
మన జాతి గొప్పదని ప్రపంచానికి చాటుదామా?

**- ఆశన్నగారి ఆనందీశ్వరరెడ్డి**
8179192999



## విష సర్పాల సంచారం!

ఆకుపచ్చని లోయలో
నిలువెత్తు విష సర్పాల సంచారం
మతం ముసుగేసుకున్న ఉన్మాదాన్ని చూసి
ప్రపంచమే నెవ్వరపోతున్నది!
సర్పయాగం ఒకటి మొదలుపెట్టందే
కునుకు లేని జీవితానికి స్వస్తి పలకలేము!
లేత ఇల్లాలు రోదన చెవుల్లో
నిద్ర స్థితిలోనూ మారుమోగుతున్నది
కళ్ళముందే తండ్రిని వివస్త్రుని చేసి
నిలువునా కాల్చేస్తుంటే
ఆ పసి గుడ్డు విహ్వలత్వం
ముద్ద నోట్లో దిగనివ్వడం లేదు!
ఉదారవాదానికి చెల్లు చీటీ రాయందే
దేశ సరిహద్దులు తలెత్తుకోలేవు
సామరస్యం సకలజనుల సౌభాగ్యం
నా బోటి వాళ్లకు వాంఛనీయమే!
చీడ పురుగులను ఏరిపారేయందే
నా వాంఛిత కల నెరవేరదు
బిడ్డలను పోగొట్టుకున్న దేశానికి తెలుసు
ప్రతీకారేక్ష ఎంత అవశ్యమో!
వాడు సవాలు విసిరుంటే బాగుండేది
మూతోడ్ జవాబు చెప్పేవాళ్ళం
కుట్రలకు తెరదీశాడు
కనికరమక్కరలేదు!
తేరుకున్న దేశం ఒక్కటై నిలిచింది
మనం ఈసారి కొట్టే దెబ్బకు
హిమాలయాల ఆవల
సువిశాల శ్మశానాలే విస్తరించాలి!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

## అమానవీయతదే మతం?

వాళ్ళు ప్యాంటు విప్పమన్నారు
నేను మనసు విప్పి చూశాను
మతం తెలుసుకోవాలనుకున్నప్పుడే
తెలిసిపోయింది!
ఈ భూమ్మీద ఏ మతస్తులూ వారు కాదు
అసలీ భూమ్మీద ఉండదగ్గ మనుషులే కాదు
వాళ్ళకేవాదం లేదు
నరమేధం తప్ప!
తుపాకీ వాదానికి మతం ఉందంటే
మనిషన్న వాడెవడూ నమ్మడు గాక నమ్మడు
నువు హిందువా ముస్లిమా అని అడిగినపుడే
వాడు మనిషా జంతువా అని అడగాలనిపించింది
నేను మనిషినని నాకు తెలుసు
వాడు మృగమని వాడికీ తెలుసు
అందుకే వాడి తుపాకీ గర్జించింది..
నా కుటుంబం వేదనతో ఆక్రోశించింది!
యమభటులు రక్షకభటుల్లా వచ్చి భక్షించి
వెళ్లిపోయేరు
వినోదం విషాదమై ఎన్నో కుటుంబాలు
కొండలే గుండెలు బాదుకొనేలా
మంచే మండిపోయేలా ఆరిపోయేయి
మానవత్వం సిగ్గుపడి ఎక్కడో దాక్కుంది!
వెదికి తీసుకురావాలి
విచారించి వివరాలు అడగాలి..
మా పంచప్రాణాలు తీసినా సర్వమత
సమానత్వమే మా ఆరోప్రాణమని చెప్పాలి!

**- భీమవరపు పురుషోత్తమ్**
9949800253

## చూసావా

చిగురుటాకులా వొణుకుతున్న జనజీవన దృశ్యం
అమాయకప్రాణాలే కుంచలైగీసిన రక్తవర్ణచిత్రం
నాగరిక సమాజానికి తగిలిన పెనుగాయం
గణతంత్ర వ్యవస్థ పాడిన మహా విషాదగేయం
చూసావా
సర్వోన్నతజాతికి హేయం
స్వేచ్ఛగా యధేచ్ఛగా
గుండాలు గుడ్లురిమిన హింసాకాండ నిర్వహణలో
ఘోరాకలి మిగిల్చిన వికృతకళాకేళి
నేరజ్వాల రగిల్చిన భయానక మృత్యురవళి
చూసావా
ఎడతెగనిహింస
క్షతగాత్రమైన శాంతిహంస
కుల మత వర్గ వర్ణ తెగ కాంక్ష
విశ్వ శ్రేయాన్ని బలిపెడితే
కుత్తుకలు తెగిపడి రక్తాలు ధారకట్టి
అశాంతి చెలరేగితే
కంటక రహదారికి దారిచూపేది
లౌకిక భువన భవన నిర్మాణానికి రాల్లేత్తేకూలీలు
విశాల భారత నందన వనమాలీలు

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# ప్రతి విద్యార్థి ఆర్డిటి సేవలను ఉపయోగించుకోవాలి కోసిగి ఏటీఎల్ కృష్ణయ్య

కౌతాళం, ఏప్రిల్ 24 మనం న్యూస్: కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాలు ,ప్రజలకు, పదవ తరగతి లో 500 మరియు ఆ పై మార్కులు తెచ్చుకొన్న విద్యార్థి నీ, విద్యార్థులకు,మరియు ఉపాధ్యాయులకు అందరికి విజ్ఞప్తి,'' ఆర్డిటి సిఈటి 2025 సంబందించిన వివరాలు స్టేట్ సిలబస్ లో 500 ఆపైన మార్కులు వచ్చినవారు, సెంట్రల్ సిలుబస్ లో అయితే 420 ఆపై మార్కులు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు.ఏదైనా గవర్నమెంట్ స్కూల్స్ లో చదివినవారు అర్హులు ఉదాహరణ:( జడ్పీహెచ్ఎస్, ఏపీ రెసిడెన్సియల్స్, కేజీబీవీ స్కూల్స్,మోడల్ స్కూల్స్,మునిసిపల్ హై స్కూల్స్, మొదలగునవి), గ్రామీణ ప్రాంతం లోని ఆర్డిటి పని చేస్తున్న ఎస్సీ,ఎస్టి, కుటుంబాలలోని ఆర్డిటి



స్పాన్సర్ నంబర్స్ కలిగిన వారు ప్రయివేట్ స్కూల్స్ లో చదివిన వారికి అప్లయ్ చేసుకొనే అర్హత ఉంటుంది.కావున అర్హత కలిగిన వారు తప్పకుండా 25.4.25 రోజు 20 గంటల నుండి 30.4.25 అప్లయ్ చేసుకోవడానికి చివరి రోజు కావున అర్హత కలిగిన వారు ఆర్డిటి కార్యలయం కోసిగిలో (నారాయణ కాలేజ్ మరియు రైల్వే స్టేషన్ మధ్యలో) అప్లయ్ చేసుకోవచ్చు అని ఆర్డిటి సంస్థ తరుపున తెలియజేయడం జరుగుతుంది.కచ్చితంగా తేవాల్సిన సర్టిఫికెట్స్ఆధార్ కార్డ్ ,కుల దృవీ కరణ పత్రము (ప్రస్తుతానికి పాతది అయిన పరవాలేదు),10 తరగతి హాల్ టికెట్, ఆన్ లైన్ మారక్స్ లిస్ట్,రేషన్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కారడ్స్ స్టడీ సర్టిఫికెట్, పాస్ ఫొటోస్ 4 తీసుకుని రావాలని తెలియజేయడమైనది రేపటి (25.4.25 )నుండి ఆర్ డి టి ఫీల్ ఆఫీసు కోసిగి నందు అప్లై చేసుకోవాల్సిందిగా కోరుచున్నాము. అదేవిధంగా ఆర్డిటి సెట్ విధి, విధానాలు, నియమ, నిబంధనలు అప్లయ్ చేసుకోవడానికి వచ్చిన వారికి రాతపూర్వకంగా ఇవ్వడం జరుగుతుంది. ఈ అప్లయ్ చేసుకోవడానికి చివరి తేది 30.5.25 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే. కావున అందరూ అప్లయ్ చేసుకోవాలని మనవి.10వ తరగతి సెంట్రల్ సిలబస్ వారికి రిజలట్స్ వచ్చిన తరువాత నోటిఫికేషన్ ఇవ్వాబడును. మరిన్ని వివరాలకు బి. క్రిష్ణయ్య, ఏరియా ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ ఆర్డిటి ఫీల్ ఆఫీస్,కోసిగి సెల్ నంబర్ :9618796111.ఆర్గనైజర్స్,నాగేంద్ర కోఆర్డినేటర్ సెల్.9963227703,నరసింహుడు కోఆర్డినేటర్ సెల్.9703703978. సంప్రదించాలని కోరారు.

## ఎంపీడీవో కార్యాలయం నందు పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు



జూపాడుబంగ్లా, ఏప్రిల్ 24 (మనం న్యూస్): జూపాడుబంగ్లా మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు, ఎంపీడీవో గోపికృష్ణ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను జరిపించారు, ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పి సువర్ణమ్మ, మండ్లెం గ్రామ సర్పంచ్ కురుపమ్మ, జూపాడు బంగ్లా ఎంపిటిసి మోతే వెంకటమ్మ, హాజరు కావడం జరిగినది, ఈ హాజరైన వారిని పూలమాలలు వేసి దృశ్యాలువాతో సత్కరించడం జరిగినది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి చెందే దిశగా ఉంటుందని, ప్రజలకు ఏ విధమైన అవసరాలు ఉన్నాయో ఆ అవసరాలు తీర్చే విధంగా ఈ పంచాయతీరాజ్ వ్యవస్థలు పనిచేయడం జరుగుతుందని, ఈ పంచాయతీరాజ్ వ్యవస్థ తోనే ప్రతి ఒక్క గ్రామానికి అభివృద్ధి దిశగా పంచాయతీరాజ్ వ్యవస్థ పని చేస్తుందని, అందువల్లనే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను జరుపుకుంటున్నామని వారు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శిలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగినది.

## సెల్ ఫోన్ టవర్ ఎక్కి హల్ చల్ చేసిన యువకుడు



మంత్రాలయం, ఏప్రిల్ 24 (మనం న్యూస్) : మంత్రాలయంలో భార్య తనతో సెల్ ఫోన్ లో మాట్లాడటం లేదని నన్ను పట్టించుకోవడం లేదని భర్త మోహన్ సెల్ ఫోన్ టవర్ ఎక్కి చస్తానని హల్ చల్ చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు కిందికి దిగాలని గ్రామస్తులు భారిగా అక్కడకు చేరుకొని నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు.అనంతరం సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మైకులు ద్వారా కిందకు దిగాలని సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.టవర్ ఎక్కిన యువకుడుకు నచ్చజెప్పి పోలీసులు ఆయువకుని కిందకి దింపారు. ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ట్స శివాంజల్ భార్య భర్తలను పోలీసు స్టేషన్ కు తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు.

---------------

## దాడులకు పాల్పడిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి




నందికొట్కూర్, ఏప్రిల్ 24 (మనం న్యూస్): జమ్మూ కాశ్మీర్ పహల్గం లో మంగళవారం ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ, ఈరోజు నందికొట్కూరు ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో పటేల్ సెంటర్ వద్ద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సానుభూతి తెలియజేస్తూ. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ నాయకులు మరియు ప్రజలు అందరు మద్దతు తెలిపారు, ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామనీ మరణించిన వారి కుటుంబాలకు మా తరుపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని. అన్నారు. అలాగే పాకిస్తాన్ ఒక విషయం గుర్తు చేసుకోవాలి గుంట నక్కల దెబ్బతీసే బుద్ధి మిది అమాయకపు ప్రజల్ని చంపేసి గెలిచామని విర్రవీగుతున్నారు మర్చిపోయారా సింహంలా మీ భూభాగంలోకి చొచ్చు కొచ్చి గన్ను గురిపెట్టి చేసినటువంటి సర్జికల్ స్ట్రైక్ మర్చిపోయారా బాలాకోట్ లోని జైష్ ఏ శిక్షణా శిబిరంపై చేసినటువంటి దాడిని అభినందన వర్తమాన్ వీరత్వం మర్చిపోయారా. అలాంటి సర్జికల్ స్ట్రైక్ని మీరు మరోసారి కోరుకుంటున్నారు. అని గుర్తు చేశారు బాధితులకు దేశం మొత్తం అండగా ఉంటుందనీ, భారతీయుల మనోబలాన్ని దెబ్బతీసే ఈ చర్యకు ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించక తప్పదు అని. కశ్మీర్లో శాంతికి విఘాతం కలిగించిన ఉగ్రవాదులకు భారతదేశం తగిన గుణపాఠం చెబుతుందనీ పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఎబివిపి పూర్వ కార్యకర్తలు మరియు ఏ బీ వీ పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు నిజ బృందావన దర్శనం



మంత్రాలయం , ఏప్రిల్ 24, మనం న్యూస్: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. గురువారం ఏకాదశి తిథి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో కాషాయ వస్త్రాలతో తులసి మాలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. ఏకాదశి తిథి కావడం వల్ల స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం పరిమళ ప్రసాద విక్రయం లేకపోవడం కొనసాగుతున్న సాంప్రదాయం.

## పదవ తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ



జూపాడుబంగ్లా, ఏప్రిల్ 24 (మనం న్యూస్): మండలంలోని మండ్లెం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు, బి, కల్పన, 577 మార్కులు సాధించి ప్రథమ స్థానం లోను, ఎం అక్షయ, 535 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలోనూ, పి నజీర్ అహ్మద్ 520 మార్కులు సాధించి తృతీయ స్థానంలోనూ, నిలిచారని అంతే కాకుండా జూపాడు బంగ్లా మండలం మొత్తానికి బి కల్పన 577 మార్పులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం గిరిధర్ రెడ్డి, తెలియజేశారు అదేవిధంగా విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించి వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

---------------

## జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా ర్యాలీ



బేతంచేర్ల, ఏప్రిల్ 24(మనంన్యూస్): జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో జరిగిన ఉగ్రవాద దాడి లో 30 మంది చనిపోవడంతో దాడిని ఖండిస్తూ నిరసనగా హిందువుల ధార్మిక సంఘాల తో పట్టణంలో ఆంజనేయస్వామి దేవాలయం నుండి ర్యాలీ బయలుదేరి పురవీధుల నుండి పాత బస్టాండ్ కొత్త బస్టాండ్ హిందువులు తరలి వచ్చారు ర్యాలీలో హిందువు ధార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గాం లో జరిగిన దాడి మన భారతదేశంలో జరిగిన దాడి ప్రతి ఒక్క భారతీయుడు ఖండించాలని కులమతాలు లేకుండా ప్రతి హిందువు ముస్లిము క్రిస్టియన్ అన్ని మతాల వారు ఖండించాలని పిలుపునిచ్చారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్డిటి సెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరణ

పత్తికొండ, ఏప్రిల్ 24 (మనం న్యూస్ ): పత్తికొండ ఆర్డిటి ఏరియా కు సంబంధించిన తుగ్గలి,మద్దికేర, ఆస్పరి,దేవనకొండ మండల పరిధి గ్రామాలలోనే ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ, ఏపీ ఆర్ ఎస్ పాఠశాలల్లో చదువుకొని 10వ తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు నుండి ఆర్ డిటి సెట్ ప్రవేశ పరీక్ష కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పత్తికొండ ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆర్.ధనంజయ తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ లోపు పత్తికొండ ఆర్డిటి కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 10వ తరగతి మారక్స్ మెమో, హాల్ టికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ జిరాక్స్ కాపీల తో పాటు 2 పాస్ ఫొటోస్ పత్తికొండ ఆర్డిటి ఏరియా కార్యాలయంలో ఇవ్వాలని ఆయన తెలిపారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం




తుగ్గలి, ఏప్రిల్ 24(మనం న్యూస్): తుగ్గలి మండల పరిధిలోని బొందిమాడుగుల గ్రామ సచివాలయ కార్యాలయంలో గురువారం సర్పంచ్ చౌడప్ప, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు శామ్యూల్, రాజశేఖర్, మద్దిలేటి లకు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం నిందితులను వెంటనే ఉరి తీయాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24, మనం న్యూస్: పహల్గాం నిందితులను వెంటనే గుర్తించి బహిరంగంగా నిందితులను వెంటనే ఉరి తీయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తాలో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండించారు. మృతి చెందిన కుటుంబాల సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థకు వత్తాసు పలుకుతున్న పాకిస్తాన్ కు ప్రపంచ దేశాలు సహాయ నిరాకరణ చేయాలన్నారు. పహల్గాం సంఘటనకు బాధ్యత వహించి ప్రధాన మంత్రి మోడీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.


---------------

## నూతన మందిరం నిర్మాణం కొరకు దాతలు దాతృత్వం ఇవ్వండి



తుగ్గలి, ఏప్రిల్ 24( మనం న్యూస్): తుగ్గలి మండల పరిధిలోని లింగనేని దొడ్డి గ్రామంలో గత 15 సంవత్సరాలుగా ఉన్న ఎల్-షాద్దాయ్ క్రీస్తు మహిమ మినిస్ట్రీస్ మందిరం కొన్ని రోజుల క్రితమే కరెంటు షార్ట్ సర్క్యూట్ జరిగి కాలిపోయిందని సంఘ పెద్ద మోషయ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా సొంత స్థలంలోనే నూతన మందిరం కొరకు రూ. 7 లక్షలు వరకు నిర్మాణ పనులు చేపట్టానని, నాకున్న ఆర్థిక పరిస్థితుల వల్ల నూతన మందిర నిర్మాణ పనులు నిలిచిపోయారన్నారు. మందిర నిర్మాణ పనులకు సహాయం చేయగలిగే వారు ఈ నెంబర్ ను 9502036035 సంప్రదించాలని ఆయన కోరారు.

# ఓటిపి తెచ్చిన తంటా..




- దరఖాస్తుదారులకు మంట...
- జనన.. మరణ.. ధృవ పత్రాలకు మరలా జన్మెత్తలా..?
- ధృవ పత్రాల కోసం కళ్లలో వత్తులేసుకుంటున్న దరఖాస్తుదారులు
- బల్దియాలో కార్యాలయాల చుట్టూ బారులు తీరుతున్న ప్రజలు
- అయోమయంగా ఆపరేటర్లు, అతలాకుతలంగా దరఖాస్తుదారులు

హైదరాబాద్,ఏప్రిల్24(మనం న్యూస్): ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు, సేవలు ప్రజలకు మెరుగైన పద్ధతిలో ఎలాంటి ఇక్కట్లకు తావు లేకుండా పారదర్శకంగా ఉండేందుకు వీలుగా, సులువుగా, సౌకర్యవంతంగా ప్రభుత్వ సేవలను ప్రజలు పొందేందుకు కొన్ని ప్రభుత్వ సేవలను విధివిధానాలను పునరుద్ధరించడం గాని, మెరుగుపరచడం కానీ సర్వసాధారణం. అలా పునరుద్ధరించిన ఓ ప్రభుత్వ సేవనే అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వ కార్యాలయంలో ఆపరేటర్లకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం జనన మరణ ధ్రువపత్రాలు పారదర్శకంగా జారీ చేయాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఓటిపి పద్ధతి... ఆపరేటర్లకు తంటాలు తెచ్చి పెడుతుంటే.. దరఖాస్తుదారులు మాత్రం మండిపడుతున్నారు. బల్దియా పరిధిలో ఎక్కడ ఏ మున్సిపల్ కార్యాలయం చూసిన ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు కార్యాలయాల చుట్టూ బారులు తీరుతూనే ఉన్నారు. జనన మరణ ధృవ పత్రాలు కొరకు దరఖాస్తు చేసుకున్న ఏడు పనిరోజుల్లో ధృవీకరించి జారీ చేయాల్సిన ధ్రువపత్రాలు నెలలు గడుస్తున్న ఇంకా జారీ కాకపోవడంతో జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజలు విసుగు చెందుతున్నారు. ప్రతి దరఖాస్తుకు మెడికల్ ఆఫీసర్ నుండి ఆపరేటర్ ఓటిపి పొందాలి. ఉదాహరణకు ఒక్కరోజులో ఒక పది దరఖాస్తులు జారీ చేయాలంటే పది సార్లు మెడికల్ అధికారి నుండి పది సార్లు ఓటీపీలు పొందాల్సి వస్తుంది. దీంతో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ని పదేపదే ఓటీపీ అడగలేక దరఖాస్తులు వేగంగా పూర్తి చేయలేక ఆపరేటర్లు గందరగోళంతో పాటు ప్రజల ఆగ్రహానికి సైతం గురవుతున్నారు.

### తక్షణమే ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలి...

జనన మరణ పత్రాలు పారదర్శకంగా వేగంగా జారీ అయ్యే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపించి, ఈ సమస్యకు వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే నెలల తరబడి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సైతం వెంటనే జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కర్రెగుట్టలపై ఎన్ కౌంటర్



- ముగ్గురు మావోయిస్టుల మృతి
- ధృవీకరించిన ఐజిపి సుందర్ రాజ్

చర్ల, ఏప్రెల్ 24 (మనం న్యూస్) : కర్రెగుట్టలపై వేట మొదలయింది. మోస్ట్ వాంటెడ్ నేత మడివి హిడ్మాతో పాటు ఇతర అగ్రనేతలు, వందల మంది మావోయిస్టులు కర్రెగుట్టలపై తల దాచుకున్నారనే నిఘా వర్గాల సమాచారం, రెండు వారాల క్రితం కర్రెగుట్టలపైకి ఎవరూ రావద్దని, తమ రక్షణ కొరకు ఐఈడి లను అమర్చామని మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటి కార్యదర్శి శాంత పేరిట లేఖ విడుదల చేయడంతో మావోయిస్టుల కదలికలను నిర్ధారించుకున్న భద్రతా బలగాలు మూడు రోజుల క్రితం తెలంగాణ, ఛత్తీస్ఘడ్, మహారాష్ట్ర వైపుల నుండి డి ఆర్ జి, ఎస్ టి ఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్, సి ఆర్ పి ఎఫ్ బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టాయి. ఛత్తీస్ఘడ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా పూజారికాంకేర్ వైపు నుండి భద్రతా బలగాలు ఒకొక్కటిగా మావోయిస్టులు అమర్చిన ఐఈడిలను వెలికితీసి నిర్వీర్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. చివరకు గురువారం ఉదయం భద్రతా బలగాలు లక్ష్యానికి చేరువయి మావోయిస్టు వేట ప్రారంబించారు. గురువారం ఉదయం భద్రతా బలగాలకు మావోయిస్టులు తారస పడటంతో ఇరు వర్గాల నడుమ పోరు ప్రారంభమైంది. ఈ ఎన్ కౌంటర్ లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత, కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా నేతృత్వం వహించే పి ఎల్ జి ఏ బెటాలియన్ నెంబర్ 1 కు చెందిన యూనిఫాం దరించిన ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన మావోయిస్టుల మృత దేహాలను స్వాదీన పరుచుకొని గుర్తించే పనిలో ఉన్నామని వెల్లడించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో పెద్ద మొత్తంలో ఆయుదాలు, పేలుడు పదార్థాలు, మావోయిస్టు సామగ్రిని స్వాదీన పరుచుకున్నట్లు వెల్లడించారు. మరో వైపు కర్రెగుట్టలకు సరిహద్దు రాష్ట్రాలలోని వైద్యశాలలను అప్రమత్తం చేసారు. అంబులెన్స్ లు, మందులను అందుబాటులో ఉంచారు. జవాన్ లు గాయపడితే చికిత్స నిర్వహించేందుకు హెలీ కాప్టర్ లను అందుబాటులో ఉంచారు. హెలికాప్టర్ ల ద్వారా గుట్టలపై ఉన్న భద్రతా బలగాలను ఆహారపదార్థాలు, త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. శుక్ర, శనివారం నాటికి భీకరపోరు సాగవచ్చని బావిస్తున్నారు.

## పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి




భువనగిరి, ఏప్రిల్ 24( మనం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో కాశ్మీర్ లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని తీవ్రంగా ఖండించి, వారి ఆత్మకు శాంతించాలని కోరుతూ నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ పర్యటించడానికి వెళ్లిన సందర్శకులని ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన యావత్ దేశప్రజల్ని కలచివేసిందని ఇది హేయమైన చర్య అని అన్నారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు పునవృత్తం కాకుండా తగిన జాగ్రత్త లు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవరకొండ లావణ్య, జిల్లా ప్రచార కార్యదర్శి బైరపాక సీరిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు చెన్నయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మనం Manam



# పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసిన భారత్

**ఢిల్లీ, ఏప్రిల్ 24 :** పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తోంది. తాజాగా పాక్ జాతీయులకు వీసా సేవలు నిలిపివేసింది. వైద్యపరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు మన విదేశాంగ శాఖ ఆదేశాలు ఇచ్చింది. '' పాక్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకానున్నాయి. ఆ దేశీయులకు జారీ చేసిన అన్ని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను వీడివెళ్లిపోవాలి. ఈ దేశ పౌరులు పాక్‌లో పర్యటించవద్దని సూచిస్తున్నాం'' అని విదేశాంగ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉంటే.. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని మోడీఅధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని కీలక నిర్ణయాలు



వెలువడ్డాయి. భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు వారు దేశం వీడి వెళ్లేందుకు వారం గడువు విధించారు. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేస్తున్నట్లు చెప్పారు. మే ఒకటో తేదీలోగా దేశం వీడి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విదేశాంగ శాఖ ఆ దేశ ప్రజలనుద్దేశించి సవివర ప్రకటన విడుదల చేసింది.

**భారత్ అల్టిమేటం.. మనదేశం వీడుతున్న పాకిస్థానీయులు**

ఇక ఇప్పటికే పాక్ జాతీయులు అమృత్‌సర్‌లోని అటారీ- వాఘా రోడ్డు మార్గం ద్వారా భారత్ను వీడుతున్నారు. దీనిలో భాగంగా పలు పాకిస్థానీ కుటుంబాలు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్దకు చేరుకున్నాయి. ''ఢిల్లీలో ఉన్న మా బంధువులను కలిసేందుకు ఏప్రిల్ 15న మేం భారత్ వచ్చాం. మా వీసా గడువు 45 రోజులు ఉంది'' అని ఓ పాక్ కుటుంబం వెల్లడించింది. సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు విడిచారు.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఇది సీమాంతర కుట్రే అని, సూత్రధారులను దోషులుగా నిలబెడతామని భారత ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# జమ్మూ కశ్మీర్‌కు వెళ్లొద్దు..!

- అమెరికన్ పౌరులకు విదేశాంగ శాఖ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** జమ్మూ కశ్మీర్‌లో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉండటంతో.. అమెరికా తమ పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. పహల్గాం ఉగ్రదాడితో అమెరికా అప్రమత్తమైంది. తమ దేశస్తులు ఎవరూ జమ్మూ కశ్మీర్‌కు ప్రయాణాలు పెట్టుకోవద్దని, ఉగ్రదాడులు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని పేర్కొంది. దీంతోపాటు భారత్-పాక్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల సమీపంలోకి కూడా వెళ్లొద్దని తెలిపింది. ''కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లోఉద్రిక్త పరిస్థితి తలెత్తే లేదా ఉగ్రదాడులు జరిగే



ప్రమాదం ఉంది. ఆ ప్రాంతానికి వెళ్లవద్దు. తూర్పు లద్దాఖ్, దాని రాజధాని లేహ్‌కు వెళ్లొచ్చు. ఇక నియంత్రణ రేఖ వద్ద కూడా హింసాత్మక ఘటనలు జరగొచ్చు. కశ్మీర్‌లోయలోని శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గాంలో హింస చెలరేగవచ్చు. సైనిక ఘర్షణకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో సరిహద్దులకు 10 కిలోమీటర్ల వరకు వెళ్లవద్దు'' అని అమెరికా విదేశాంగశాఖ పేర్కొంది.పహల్గాం దాడిని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆయన నిన్న ప్రధాని మోదీకి నేరుగా కాల్ చేసి మాట్లాడారు. ఉగ్రవాదులను పట్టుకోవడంలో భారత్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

# వీసాల రద్దు ఆపండి: అమెరికాలో భారతీయ విద్యార్థులకు ఊరట

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** అమెరికాలో ట్రంప్ యంత్రాంగం 133 మంది విద్యార్థులకు నిలిపేసిన ఎస్ఈవీఐఎస్ (స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)ను న్యాయస్థానం పునరుద్ధరించింది. దీనిలో అధిక మంది భారత్‌కు చెందినవారున్నారు. అమెరికా విదేశాంగశాఖ వీరి




వీసాలను రద్దు చేయడంతోపాటు ఎస్ఈవీఐఎస్‌ను టెర్మినేట్ చేయడంపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు అక్కడి ప్రభుత్వ ఏజెన్సీల వాదన భిన్నంగా ఉంది. ఈ విద్యార్థులు పలు సందర్భాల్లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టిలోపడ్డారని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తాము తాత్కాలికంగా అడ్డుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెబుతున్నాయి. కానీ, ఈ విద్యార్థులకు ఎటువంటి నేర చరిత్ర లేదు. ఇక ఇమిగ్రేషన్ లాయర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఏ నేరాలు చేయకపోయినా.. వారి లీగల్ స్టేటస్‌లను తొలగించారన్నారు. 'క్యాచ్ అండ్ రివోక్' పేరిట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో విద్యార్థి వీసా ఉన్నవారి పరిస్థితిని ఏఐ టూల్స్‌తో సమీక్షిస్తారు. చివరికి వారి సోషల్ మీడియాను కూడా పరిశీలిస్తారు. ఈ ప్రోగ్రామ్ కింద దాదాపు 300 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులు, చైనీయులు, నేపాలీలు, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ వాసులున్నారు. అమెరికాలో చాలామంది భారతీయులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కింద ఉన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా స్టెమ్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఈ అవకాశం లభిస్తుంది. దాదాపు 36 నెలల పాటు అక్కడ పని చేయవచ్చు. ఈ సమయాన్ని వారు హెచ్-1బీ వర్క్ వీసా వంటివి సాధించేందుకు వారధిగా వాడుకొంటారు. ఓపీటీ స్టేటస్ పోతే అమెరికాలో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది.

తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదైందని వీసా రద్దు చేశారు. తాజాగా రద్దైన 327 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే స్వల్ప రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసలు అమెరికా విదేశాంగ శాఖ వీసాలను రద్దు చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని లాయర్లు పేర్కొంటున్నారు.

# ఐక్యరాజ్యసమితి వేదికగా అమెరికా, చైనా కస్సుబుస్సు

**న్యూయార్క్, ఏప్రిల్ 24:** ఐరాస వేదికగా అమెరికా, చైనాలు విమర్శ, ప్రతివిమర్శలు చేసుకున్నాయి. అమెరికా- చైనాల మధ్య వాణిజ్యయుద్ధం తార స్థాయికి చేరుకుంటోంది. ఇప్పటికే పరస్పర సుంకాలతో ప్రతీకార చర్యలు తీసుకొంటున్న ఇరు దేశాలు తాజాగా.. ఐక్యరాజ్య సమితి వేదిక మీద విమర్శ, ప్రతివిమర్శలతో విరుచుకుపడ్డాయి. అమెరికా సుంకాల ధోరణి మాపై బెదిరింపులతో కూడినదిగా ఉందని చైనా విమర్శించగా.. అమెరికా బీజింగ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చింది. బుధవారం ఐరాసలో భద్రతా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో చైనా తరఫు రాయబారి ఫు కాంగ్ మాట్లాడుతూ యూఎస్ విధించిన సుంకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం తమ వాణిజ్య భాగస్వాములపై సుంకాలు విధించి ప్రపంచ ఆర్థికవ్యవస్థకు విఘాతం కలిగించింది. పరస్పరం అనే ముసుగులో యూఎస్ టారిఫ్ల ఆట ఆడుతోంది. ఇతర దేశాలకు నష్టం కలిగించి.. తమ సొంత ప్రయోజనాలను అభివృద్ధి చేసుకోవాలని చూస్తోంది. ఈ చర్య ఇప్పటికే అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్యక్రమాన్ని దెబ్బతీస్తోంది. మేము అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలా, లేక ఇలాంటి అర్థం లేని



చట్టాలను పాటించాలా. మాపై భారీ స్థాయిలో సుంకాలు విధించడం బెదిరింపులతో కూడినదిగా ఉంది. ఇలా మాపై ఒత్తిడి పెంచడం సరైన చర్య కాదు' అని ఫు కాంగ్ పేర్కొన్నారు. ఇక, ఈ వ్యాఖ్యలకు అమెరికా మిషన్ ప్రతినిధి టింగ్ వు గట్టిగా బుదులిచ్చారు. చైనా విశ్వసనీయత లేని వ్యాఖ్యలు చేస్తోందన్నారు. ప్రపంచం చైనా వాదనలు వినకుండా.. ఆ దేశం చేస్తున్న చర్యలను చూడాలని ఆయన ఎద్దేవా చేశారు. చాలాకాలంగా బీజింగ్ ఏకపక్షమైన, అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరించిందన్నారు. కాగా.. ప్రపంచ దేశాలపై సుంకాల విధింపులో భాగంగా వాణిజ్య దేశాలతో పాటు ట్రంప్ చైనా పైనా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ దేశంపై 145 శాతం సుంకం అమలులో ఉంది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యంపై బీజింగ్ 125 శాతం టారిఫ్లను ప్రకటించింది. దీంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది.

# దేశ సమగ్రతే ముఖ్యం.. ప్రభుత్వానికి అండగా ఉంటాం: డీకేఎస్



**బెంగళూర్, ఏప్రిల్ 24:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలపై కర్ణాటక డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ స్పందించారు. దేశ సమగ్రతే తమకు అత్యంత ముఖ్యమన్న ఆయన.. కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడతామన్నారు. కొందరు దీన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలంతా కలిసి శాంతిని కాపాడుకోవాలని, ఈ సమయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు. మరోవైపు, పహల్గాం ఉగ్ర దాడి ఘటనను కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి సీడబ్ల్యూసీ తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది. ఇది పిరికిపంద చర్య, పాకిస్థాన్ పన్నిన కుట్రగా పేర్కొంది. దేశవ్యాప్తంగా భావోద్వేగాల్ని రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగానే హిందువులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపింది. ఈ ఘటనలో నిఘా వైఫల్యాలు, భద్రతా లోపాలపైనా సమగ్ర విశ్లేషణ తప్పనిసరి అని పేర్కొంది. ఐక్యత అత్యంత అవసరమైన ఈ సమయంలో రాజకీయాలు చేయడం దిగ్భ్రాంతికరమని తెలిపింది. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల భద్రతను జాతీయ ప్రాధాన్యతగా పరిగణించి.. అందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కేంద్రాన్ని కోరింది. పహల్గాం దాడి మృతులకు నివాళులర్పించేందుకు ఏప్రిల్ 25న దేశ వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు.

# రష్యా-ఉక్రెయిన్ శాంతి సమావేశం రద్దు

- జెలెన్స్కీని తప్పుబట్టిన ట్రంప్

**కీవ్/మాస్కో ,ఏప్రిల్ 24:** రష్యా-ఉక్రెయిన్ల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ఉద్దేశించిన సమావేశం చివరి క్షణంలో రద్దైంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఉక్రెయిన్ దేశాల రాయబారుల మధ్య ఈ సంప్రదింపులు జరగాల్సి ఉంది. లండన్‌లోబుధవారం జరిగిన ఉక్రెయిన్, రష్యా శాంతి సంప్రదింపులకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రాయబారి స్టీవ్ విట్‌కాఫ్‌లు హాజరు కాలేదు. ఫ్రాన్స్, జర్మనీ విదేశాంగ మంత్రులూ గైర్హాజరయ్యారు.

క్రిమియాను రష్యాకు అప్పగించకుండా యుద్ధాన్ని జెలెన్స్కీ సాగదీస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుయ్యబట్టారు. క్రిమియా భాగం ఉక్రెయిన్‌దేనని జెలెన్స్కీ చెప్పడాన్ని తప్పుబట్టారు. ఆయన ప్రకటనలు పరిస్థితిని సంక్లిష్టంగా మారుస్తున్నాయన్నారు. కావాలంటే మరో మూడేళ్లు యుద్ధం చేసుకుని మొత్తం దేశాన్ని వదులుకుంటారేమోనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యంగ్యంగా అన్నారు.

# పాక్ ఆర్మీ చీఫ్కు.. బిన్ లాడెన్కు పెద్ద తేడాలేదు : అమెరికా అధికారి కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్,ఏప్రిల్ 24:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ ఆర్మీ చీఫ్‌పై అమెరికా మాజీ అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనకు ఉగ్రవాది బిన్‌లాడెన్‌కు పెద్ద తేడా లేదన్నారు.

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటనను భారత్ సహా యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. దీనిపై అమెరికా మాజీ అధికారి ఒకరు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా మాజీ చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌కు పెద్ద తేడా లేదని పెంటగాన్ మాజీ అధికారి మైఖెల్ రూబిన్ వ్యాఖ్యానించారు. బిన్‌లాడెన్ అప్పుడు కలుగులో దాక్కుంటే ఇప్పుడు మునీర్ ప్యాలెస్‌లో జీవిస్తున్నారని.. ఇదొక్కటే వారి మధ్య తేడా అని అన్నారు.



''అప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత పర్యటనలో ఉన్నప్పుడు కశ్మీర్లో ఇలాంటి దాడే జరిగింది. మళ్లీ ఇప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తుండగా పహల్గాంలో ముష్కరులు నరమేధానికి పాల్పడ్డారు. ఈ దాడిపై పాక్ స్పందిస్తూ తమకు సంబంధం లేదని, స్థానికులే ఈ ఘోరానికి పాల్పడ్డారని నిందిస్తోంది. ఇలాంటి నాటకాలు ఎన్ని ఆడినా.. ఆ దేశ వక్ర బుద్ధి ఎలాంటిదో అందరికీ తెలుసు. పహల్గాం దాడికి మనంచేయాల్సింది ఒక్కటే..! పాక్‌ను ఉగ్రవాద ప్రేరేపిత దేశంగా, మునీర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించాలి'' అని మైఖెల్ రూబిన్ అన్నారు.

మంగళవారం పహల్గాంలోని ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు పేట్రేగిపోయిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. పర్యటకులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ రెచ్చగొట్టే ప్రసంగం తర్వాతే ఈ దాడి జరగడంతో వేళ్లన్నీ ఆయనవైపే చూపిస్తున్నాయి. అసీం మునీర్‌కు.. భారత్‌పై తీవ్రమైన ద్వేషంతో ఉంటాడన్న పేరుంది. ఆయన ప్రకటనలూ ఉగ్ర దాడికి పురిగొల్పేలానే ఉంటాయి. ఇటీవల ఆయన ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ.. 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన జీవనాడిలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం'' అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఈ ఉగ్రవాది చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

# షెల్టర్గా మారిన పాఠశాలపై ఇజ్రాయెల్ దాడి

**గాజా,ఏప్రిల్ 24:** గాజా నగరంలో షెల్టర్‌గా మారిన పాఠశాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 23 మంది మరణించారు. దాడులతో శిబిరంలోని టెంట్లకు మంటలు అంటుకున్నాయి. కొంత మంది సజీవ దహనమయ్యారు. దాడులపై ఇజ్రాయెల్ సైన్యం స్పందించలేదు. ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే మిలిటెంట్లు తలదాచుకుంటున్నారని, అందుకే అక్కడ దాడులు చేస్తున్నామని గతంలోనే ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందంపై అరబ్ మధ్యవర్తులు కొత్త ప్రతిపాదనపై చర్చిస్తున్నారు. బందీలందరినీ విడిపించేందుకు వీలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. గాజాకు అందే సాయంపై ఇజ్రాయెల్.. 7 వారాల నిషేధం విధించడాన్ని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తప్పుబట్టాయి.

**ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణులు**

ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపైకి బుధవారం ఉదయం యెమెన్‌లోని హూతీలు క్షిపణులను ప్రయోగించారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఈ గ్రూపు.. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై దాడి చేయడం ఇదే



తొలిసారి. హూతీల క్షిపణులు అంత దూరం ప్రయాణించడం కలకలం రేపింది. మరోవైపు అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను అడ్డుకుని కూల్చేశామని హూతీలు ప్రకటించారు.

# పరాయి దేశంలో 42 ఏళ్లు.. ఎట్టకేలకు స్వేచ్ఛ



**త్రివేండ్రం, ఏప్రిల్ 24:** 1983లో ఉద్యోగం కోసం బహ్రెయిన్ దేశం వెళ్లిన ఒక వ్యక్తి పాస్‌పోర్టు పోగొట్టుకోవడంతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. దాదాపు 42 ఏళ్ల తర్వాత ఆయన తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. ఉద్యోగం, పై చదువుల కోసం ఎంతోమంది విదేశాలకు వలస పోతుంటారు. ఈక్రమంలో కొన్ని కారణాల వల్ల కొందరు ఆ దేశాల్లో చిక్కుకుపోతుంటారు. అలా ఉద్యోగం కోసం వెళ్లి దాదాపు 42 ఏళ్లుగా బహ్రెయిన్‌లో ఉండిపోయిన వ్యక్తి కేరళకు చెందిన గోపాలన్ చంద్రన్. తాజాగా ఆయన స్వదేశానికి తిరిగివచ్చారని ప్రవాసీ లీగల్ సెల్ ఒక పోస్టు ద్వారా వెల్లడించింది. పోస్టు ప్రకారం.. కేరళలోని పొడికోణం సమీపంలో చిన్న గ్రామానికి చెందిన గోపాలన్ చంద్రన్ 1983లో ఉద్యోగం కోసం బహ్రెయిన్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఆయన యజమాని మృతిచెందాడు. ఈక్రమంలో గోపాలన్ తన పాస్‌పోర్టును పోగొట్టుకున్నారు. దీంతో ఆయన అక్కడే చిక్కుకుపోయారు. స్వదేశానికి తిరిగి వచ్చే మార్గం తెలియక.. దాదాపు 42 ఏళ్లుగా ఆ దేశంలోనే ఉండిపోయారు. ఇటీవల ఫేస్‌బుక్ వేదికగా గోపాలన్ తన ఆవేదన వ్యక్తంచేశారు. తన కుటుంబాన్ని చూడాలని ఉందని ఒక వీడియోలో వాపోయారు. ఈ వీడియో ప్రవాసీ లీగల్ సెల్ ఎన్జీవో కంటపడింది. దీంతో గోపాలన్‌ను వెనక్కి తీసుకొచ్చేందుకు బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపారు. ఈక్రమంలోనే ఆయన తాజాగా స్వదేశానికి చేరుకున్నారు. ఇక, ఈ ఎన్జీవో మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు జర్నలిస్టులతో కూడినది. వీరు విదేశాల్లో అన్యాయంగా చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తుంటారు.

# వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలు.. భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** భారత్ సుంకాలు తగ్గిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రకాల వస్తువులపై భారత్ సుంకాలు తగ్గించనుందనే విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఓవల్ ఆఫీస్‌లో పాత్రికేయులతో ఈమేరకు మాట్లాడారు. అయితే ఏ ఉత్పత్తులపై తగ్గింపు ఉంటుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా అధికారులు ఈనెల 23న వాషింగ్టన్‌లో చర్చలు ప్రారంభించారు. భారత్‌తో ఒప్పందం వల్ల అమెరికా వస్తువులకు కొత్త మార్కెట్లు తెరచుకుంటాయని, ఇరు దేశాల్లోని ఉద్యోగులు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు వస్తాయని ఇప్పటికే అమెరికా పేర్కొంది. టారిఫ్, టారిఫేతర అడ్డంకులను అమెరికా తగ్గించుకోవాలని అనుకుంటున్నట్లు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ పేర్కొన్నారు.



ఈ ఒప్పందానికి సంబంధించిన షరతుల(టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సెస్)కు ఇరు దేశాలు తుది రూపునిచ్చాయి కూడా. 90 రోజుల పాటు టారిఫ్ అమలుకు అమెరికా విరామం ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు రోజుల చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ తరఫు బృందానికి వాణిజ్య విభాగ అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్లపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్నవేళ భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోడీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు.

### గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో

# పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర

- **కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, ఏప్రిల్ 24మనం న్యూస్:** గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఉన్న పంచాయతీ రాజ్ వ్యవస్థకు, 1947 స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉన్న పరిస్థితికి చాలా వ్యత్యాసం ఉందన్నారు.. 73 వ సవరణ కు ముందు స్థిరమైన లేదా ప్రామాణిక యంత్రాంగం ఉండేది కాదన్నారు..స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు లేవని, ఉండేవి కాదని, మహిళలకు ప్రాతినిధ్యమే ఉండేది కాదని తెలిపారు.. మహిళలు అయితే గుర్తించే వారే కాదన్నారు....ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని, సింఘ్వీ, బల్వంత్ రాయ్ మెహతా తదితర కమిటీలు, దేశంలో ఉన్నఅత్యున్నత మేధావులు, సంస్థలు అధ్యయనం చేసిన తర్వాత 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా 11 వ షెడ్యూల్లో 243 ఆర్టికల్ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ ను రూపొందిస్తూ చట్టం చేశారన్నారు. ఆ చట్టాన్ని రాజ్యసభ, లోక్ సభ తో పాటు అన్ని అసెంబ్లీల్లో కూడా ఆమోదం చేసిన తర్వాత ఏప్రిల్ 24, 1993 సంవత్సరం నుండి అమలు లోకి రావడం జరిగిందన్నారు.. అందుకే ఈరోజును జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. 73 వ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థ లో పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం అయిందని కలెక్టర్ తెలిపారు.. పంచాయితీలకు చట్టపరమైన గుర్తింపు ఇవ్వడం, ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్పించడం వంటి సంస్కరణలు వచ్చాయన్నారు.. ఫైనాన్స్ కమిషన్ పరిధిలోకి రావడం, స్టేట్ ఎలెక్షన్ కమిషన్ ద్వారా సక్రమంగా ఎన్నికలు జరపడం, లోకల్ బాడీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ లకు 50 శాతం రిజర్వేషన్, మహిళకు 33 శాతం రిజర్వేషన్ లు కల్పించడం జరిగిందన్నారు.. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని, ఎంపిడిఓ లు, డి ఎల్ డి వో లు తదితర వ్యవస్థల ద్వారా గ్రామీణాభివృద్ధితో పాటు ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువగా తీసుకువెళ్లడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలు చేశామని, వేజ్ కాంపొనెంట్, మెటీరియల్ కాంపొనెంట్ లో వంద శాతం లక్ష్యాలను సాధించామని, అదే విధంగా జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ. 80 కోట్లతో 119 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని 3 నెలల్లో పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. ఇది ఒక ప్రత్యేకమైన విజయమని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని కలెక్టర్ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. నేషనల్ ఈ గవర్నెన్స్ అవార్డ్ ల కోసం దేశమంతటా కలిపి లక్షా 40 వేల దరఖాస్తులు రాగా, ఇందులో 6 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారని, ఆ 6 గ్రామ పంచాయతీలలో మద్దికెర మండలం పెరవలి గ్రామం ఎంపిక నేషనల్ ఈ గవర్నెన్స్ అవార్డ్ కి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అలాగే ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో మద్దికెర, హోళగుంద, చిప్పగిరి మండలాలు ఎంపిక అయ్యాయని, ఇందులో మద్దికెర మండలం సౌత్ ఇండియా రీజియన్ లో మొదటి స్థానంలో ఉండగా, కేంద్రప్రభుత్వం రూ.1.50 కోట్లను మంజూరు చేసిందన్నారు..చిప్పగిరి మండలం కూడా 6 వ స్థానంలో ఉందన్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయనడానికి ఇది ఒక ఉదాహరణ అని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత పటిష్టవంతం చేసేలా వ్యవస్థ పట్ల, ప్రభుత్వ పథకాల అమలు గురించి ప్రజల్లో సమగ్రమైన అవగాహన తీసుకురావాలని, అధికారులకు వ్యవస్థ పైన పూర్తి పట్టు ఉండాలని కలెక్టర్ సూచించారు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందేలా మరింతగా కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, గూడూరు ఎంపిడిఓ శివ నాగ ప్రసాద్ పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి మాట్లాడారు. అనంతరం ఉత్తమ పనితీరు కనపర్చిన పంచాయతీ రాజ్ ఎస్ఈ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఎంపిడిఓలు, ఈఓఆర్డీలు, ఇతర సిబ్బందికి కలెక్టర్ మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలి



- **ఇంటర్ డిగ్రీలో 45శాతం నిబంధన తొలగించాలి : ఏఐవైఎఫ్**

**కర్నూలు ఏప్రిల్ 24మనం న్యూస్:** డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగల కార్యదర్శి బిసన్న లు డీఎస్సీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం 44 సంవత్సరాలు వయోపరిమితి నిర్ణయించింది అయితే ఏడు సంవత్సరాల నుండి డీఎస్సీ నోటిఫికేషన్ లేనందువల్ల చాలామంది డిఎస్సి అభ్యర్థులు పరీక్ష రాసేందుకు అర్హత కోల్పోతున్నారని కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డీఎస్సీ అభ్యర్థనకు 47 సంవత్సరాల వరకు వయో పరిమితికి పెంచి చాలామంది అభ్యర్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ లో అనేక లోపాలు ఉన్నాయని వాటన్నిటిని సరి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు అదేవిధంగా డీఎస్సీ పరీక్ష రాయాలంటే ఎస్జిటి వారికి ఇంటర్మీడియట్ లో , స్కూల్ అసిస్టెంట్ వారికి డిగ్రీలో 45% మార్క్స్ వచ్చి ఉండాలని నిబంధనలను కూడా తొలగించాలని, దాంతోపాటుగా డీఎస్సీ పరీక్షకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 90 రోజులు గడువు ఇవ్వాలని అదేవిధంగా డీఎస్సీ పరీక్షను ఆన్ లైన్ నెలరోజుల వరకు నిర్వహించడం వల్ల చాలా ఏళ్ల నుంచి డీఎస్సీ పరీక్ష కోసం సిద్ధమవుతున్న వాళ్ళకి నష్టం జరిగే ప్రమాదం ఉంది కావున డీఎస్సీ పరీక్షను జిల్లా యూనిట్ గా జిల్లా మొత్తం ఒకే రోజు ఒకే పేపర్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఈ డిమాండ్ల పైన రాష్ట్ర ప్రభుత్వ స్పందించకుంటే డీఎస్సీ అభ్యర్థులను కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం స్పందించేంత వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు శివ, శ్రీకాంత్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



**తుగ్గలి,ఏప్రిల్ 24 (మనం న్యూస్):** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి విశ్వమోహన్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం సాధ్యమని అయన పేర్కొన్నారు.పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.అనంతరం పారిశుధ్య కార్మికులు రాతన రంగస్వామి, చెన్నంపల్లి బాలప్ప, ఎర్రగుడి రామాంజినేయులు ,ఉప్పర్లపల్లి చిన్న రంగన్న లను శాలువా పూలమాలలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, రాతన పంచాయతీ సెక్రెటరీ శివ, కార్యాలయం సిబ్బంది శేఖర్, వినోద్, చెన్నప్ప పాల్గొన్నారు.

## 17వ అఖిల భారత జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

- **ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు**
- **ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్**



**కర్నూల్, ఏప్రిల్ 24(మనంన్యూస్):** 2025 మే 15-18 వరకు తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు శ్రీరాములు,జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ పిలుపునిచ్చారు. పత్తికొండలో ఉన్న చదువులు రామయ్య భవనంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు,ఎద్దుల దొడ్డి గ్రామానికి చెందిన జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రధానంగా దేశంలో నిరుద్యోగ సమస్య అధికమయిందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడం మూలంగానే దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోవడం లేదని వారు విమర్శించారు.అదేవిధంగా జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ తక్షణమే ఆర్మీలో ఉన్న లక్ష 80వేలు ఉద్యోగాలును వెంటనే భర్తీ చేయాలన్నారు.ఈ కార్యక్రమాన్ని యువతి, యువకులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తుగ్గలి మండల కార్యదర్శి వినోద్,నాగేష్,కార్యవర్గ సభ్యులు రవి. కాశీ, అనిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### నగరపాలక మేనేజర్‌కు అదనపు బాధ్యతలు



**కర్నూలు ఏప్రిల్ 24మనం న్యూస్:** నగరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడికి, కమిషనర్ యస్.రవీంద్ర బాబు అదనపు బాధ్యతలు కేటాయించారు. ప్రజా సంబంధాల అధికారి కే.ఎల్.యన్. రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం పొదిలి కమిషనర్గా బదిలీ అయిన నేపథ్యంలో, ఆయన నిర్వర్తించిన బాధ్యతలను కమిషనర్ మేనేజర్ చిన్నరాముడికే అప్పగిస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉచిత మజ్జిగ పంపిణీ



**దేవనకొండ ఏప్రిల్ 24మనం న్యూస్:** మండల కేంద్రమైన దేవనకొండలో పాదాచార్యులకు ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం క్రాంతి వికలాంగుల మండల సమైక్య ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు.ఈ సందర్భంగా, ఎంపీడీవో మాట్లాడుతూ.... వేసవికాలం ని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడంహర్షించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన బిజెపి,వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

# త్వరలో గో ప్రదర్శన



మహానంది, ఏప్రిల్24,మనంన్యూస్. మహానంది పుణ్యక్షేత్రం లో గో ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తామని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవలే శ్రీశైలం గోశాల నుండి కపిల గోవును తీసుకురావడం జరిగిందన్నారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో నిత్యం ఏదో ఒక సమయంలో గో ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా తీసుకువస్తామన్నారు. నందీశ్వరుని పేరుతో ఉన్న ఈక్షేత్రంలో నందీశ్వరుని దర్శనం చేపట్టడం జరుగుతుందన్నారు.

# గుర్తింపు లేని పార్టీల వివరాలు అందించండి

- **భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్**




**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 24 (మనం ప్రతినిధి):** ఏప్రిల్ 28 నాటికి రిజిస్టర్ గుర్తింపు లేని పార్టీల వివరాలు అందించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ అన్నారు.గురువారం భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ రిజిస్టర్ గుర్తింపు లేని పార్టీల నివేదిక పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకుని గుర్తింపు పొందని రాజకీయ పార్టీ వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు సేకరించి ఏప్రిల్ 28 నాటికి భారత ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని సూచించారు. రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలను మినహాయించి దేశంలోని మిగిలిన రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో జిల్లా ఎన్నికల అధికారులకు ఏప్రిల్ 22 న రిజిస్టర్ చేసుకుని గుర్తింపు లేని రాజకీయ పార్టీల వివరాల సేకరణ గురించి మార్గదర్శకాలు జారీ చేశామని, వాటిని తూచా తప్పకుండా పాటించాలని అన్నారు.రిజిస్ట్రేషన్ చేసుకుని గుర్తింపు లేని రాజకీయ పార్టీల అధ్యక్షులకు సమాచారం అందించి ఎన్నికల కమిషన్ నిర్ణీత నమూనా ప్రకారం పార్టీ సంబంధిత వివరాల రిపోర్టు సంతకంతో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.మన దగ్గర ఉన్న వివరాల ప్రకారం గుర్తింపు లేని రాజకీయ పార్టీల అడ్రస్ లో సంబంధిత పార్టీ లేని పక్షంలో ఆ వివరాలను కూడా అందించాలని అన్నారు.ఈ సమావేశంలో సంబంధిత ఎన్నికల అధికారులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

### బదినేహాల్లో మెరిసిన ఆణిముత్యం పులి రాహుల్



**కౌతాళం, ఏప్రిల్ 24 మనం న్యూస్:** కర్ణాటక బార్డర్ లో ఉన్న బదనేహాల్ గ్రామంలో ఇటీవలే పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన బధినేహాల్ గ్రామానికి చెందిన పులి గడ్డం ఉలిగప్ప మనవడు పులి రాహుల్ ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో ఆదోని కిడ్డీస్ రూట్స్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి 600/560 మార్కులు సాధించినాదులకు బధినేహాల్ గ్రామ పెద్దలు బి. వీరుపాక్షి రెడ్డి బి.విశ్వనాథ్ రెడ్డి,వీరభద్ర గౌడ్,బి.లక్ష్మి రెడ్డి,బి.రవి రెడ్డి బి.నాకేష్ రెడ్డి మరియు బధినేహాల్ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# సుభాన్‌కు డాక్టరేట్ ప్రదానం



**మహానంది, ఏప్రిల్24,మనంన్యూస్:** మహానంది మండలం అబ్బిపురం గ్రామానికి చెందిన కంచి సుభాన్ కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈయన గణిత శాస్త్రం నందు ఫ్లూయిడ్ డైనమిక్స్ లో వివిధ ప్రవాహ గతిశీలతలతో మాగ్నెటో హైడ్రో డైనమిక్ నాన్-న్యూటోనియన్ ద్రవ ప్రవాహం యొక్క ఉష్ణ మరియు ద్రవ్యరాశి బదిలీ లక్షణాలు అనే అంశంపై అనంతపురం ఆరట్స్ కళాశాలలో గణిత విభాగంలో పని చేస్తున్న అధ్యాపకులు డాక్టర్. గద్దల ప్రభాకర్ రావు మరియు శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ లో గణిత విభాగ అధిపతి ప్రొఫెసర్ జి. శోభలత పర్యవేక్షణలో పరిశోధన చేశారు.ఈయన రాసిన పరిశోధన పత్రాలు జాతీయ,అంతర్జాతీయ స్థాయి లో ప్రచురితం అయ్యాయి . ఇతను బేతంచర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు గణిత విభాగం లో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేయుచున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి. శైలేంద్ర కుమార్ మరియు సహ అధ్యాపకులు మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాలు, తమడపల్లి వైస్ సర్పంచ్ ప్రతాపరెడ్డి, మహానంది దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు బండి హేమలత, స్నేహితులు కంచి సుభాన్ కు అభినందనలు తెలియజేశారు.

# ఎఫ్ ఆర్ విద్యార్థుల ప్రభంజనం




**దేవనకొండ, ఏప్రిల్ 24మనం న్యూస్:** పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఎఫ్ఆర్ హై స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ రఘునాథ్, ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప తెలిపారు. గురువారం ఎఫ్ ఆర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ, దేవనకొండ మండలంలో అన్ని పాఠశాలల కన్నా మెరుగైన ఫలితం సాధించిన బండారి అఖిల 556 మార్కులు సాధించడం పట్ల అభినందించారు. అలాగే విజయ్ కుమార్ 516, నిజాముద్దీన్ 5 13, చరణ్ 501 మార్కులు పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. విద్యార్థుల మంచి భవిష్యత్తుకు పదవ తరగతి పరీక్ష పునాది వంటిదని అన్నారు. ఆ తర్వాత చదివే ఇంటర్మీడియట్ లో మంచి కోర్సులు తీసుకొని విద్యార్థులు తన బంగారు భవిష్యత్తుకు పునాదాలు వేసుకోవాలని అన్నారు. విద్యార్థులు సాధారణ విద్య కన్నా సాంకేతిక విద్య వైపు విద్యార్థులు దృష్టి సారించాలని వారన్నారు అప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని, భవిష్యత్తుకు మంచి భరోసా లభిస్తుందని అన్నారు. విద్యార్థులు బాగా బాగుగా చదువుకుని భవిష్యత్తులో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆశీర్వదించారు .అలాగే ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రావణి, లక్ష్మీదేవి, స్రవంతి, రంగస్వామి, ఎస్ఎండి భాష, షబానా, గోపాల్,రవికుమార్, తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది

- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 24 (మనం ప్రతినిధి) :** శాంతి భద్రతల పరిరక్షణకు ఎప్పుడూ ముందుండే పోలీస్ సిబ్బంది,అధికారులకు మానసిక స్థితి ఎంతో కీలకం వారి మానసిక ఆరోగ్యం కాపాడటం అనేది తక్షణ అవశ్యకతగా గుర్తించి రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశాల మేరకు గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో ప్రఖ్యాత మానసిక నిపుణులు డాక్టర్ అశోక్ కుమార్, టీం చే మానసిక ఆరోగ్య అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు.ఈఅవగాహన సదస్సులో పోలీసు అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ మానసిక ఒత్తిడులపై సమగ్ర అవగాహన ఇచ్చారు.ముఖ్యంగా నిరంతర ఒత్తిడిలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎలాంటి మానసిక సమస్యలు ఎదురవుతాయో, వాటిని ఎలా గుర్తించాలి అనే విషయంపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్,ఆర్ముడ్ పోలీస్ సిబ్బంది పాత్ర కీలకమని అట్టి సిబ్బంది సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.సిబ్బంది అధికారుల మానసిక స్థితి ,మానసిక ఆరోగ్యం కాపాడటం అనేది తక్షణ అవశ్యకతగా గుర్తించి రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశాలమేరకు జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి మానసిక ఆ అగహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీస్ సిబ్బందికి శాఖపరమైన, వ్యక్తిగత సమస్య వుంటే ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకరవలని ఆయా సమస్యల పరిష్కరానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.తాత్కాలిక ఆనందాల కోసం ప్రాణాలను, కుటుంబ సభ్యులను ప్రమాదంలో పెట్టవద్దని అధికారులు, సిబ్బంది విరామ సమయంలో కుటుంబలతో గడపాలని తెలిపారు.మహిళ సిబ్బందికి సంక్షేమం కోసం అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతుందని,మహిళ సిబ్బందికి అన్ని రకాల అండగా ఉంటామని ఎస్పి తెలిపారు.నిత్యం యోగ,వ్యాయమం లాంటివి అలవాటు చేసుకోవడం ద్వారా ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదురుకోవచ్చని అధికారులకి, సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆత్మహత్యలు నివారణ సంస్థ చైర్మన్ డాక్టర్ అశోక్, సభ్యులు రామకృష్ణ ,సైకాలజిస్ట్ లు శైలజ,రామోజీరావు, బోడా అరుణ,సి.ఐ మొగిలి, మధుకర్, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు రమాకాంత్, రామ్మోహన్, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్, ఆర్.ఎస్.ఐ లు శ్రవణ్, సాయి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# భవిష్యత్తులోనూ పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోం: బీసీసీఐ ఉపాధ్యక్షుడు

పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత క్రికెట్ బోర్డు మరో కఠిన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఎప్పుడూ పాకిస్థాన్ తో ద్వైపాక్షిక సిరీసులను ఆడబోమని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టంచేశారు. 2012-13 నుంచి ఇప్పటివరకు టీమ్ఇండియా పాక్ గడ్డపై అడుగుపెట్టలేదు. కేవలం ఐసీసీ ఈవెంట్లలో తటస్థ వేదికలపైనే తలపడుతోంది. ఐసీసీ నిబంధనలు పాటించడం కోసమే బీసీసీఐ తన జట్టుకు అనుమతిస్తోంది. ఇదే విషయంపై ఐసీసీ ఆలోచన చేయాలన్నట్లుగా రాజీవ్ శుక్లా పరోక్షంగా సూచించారు. ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ లోనూ ఇరు దేశాలు తలపడ్డాయి. ఆ సమయంలో పలువురు మాజీ క్రికెటర్లు భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్ లు ఉంటే బాగుంటుందని సూచించారు. ఇప్పుడు బీసీసీఐ స్పష్టత ఇవ్వడంతో అలాంటి ఆలోచనలకు తెరపడినట్లే.



''ఉగ్రదాడికి గురైన బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే అదే చేస్తాం. ఇప్పటికే పాకిస్థాన్ తో ద్వైపాక్షిక సిరీస్ లను ఆడటం లేదు. ముమ్మందూ ఆ జట్టుతో ఆడే ప్రసక్తే లేదని బలంగా చెబుతున్నాం. అయితే, ఐసీసీ ఈవెంట్ల విషయానికొచ్చేసరికి.. అంతర్జాతీయ క్రికెట్ మండలిని గౌరవిస్తూ తటస్థ వేదికలపై ఆడుతున్నాం. ఇప్పుడు దేశంలో జరిగిన దానిపై ఐసీసీకి అవగాహన ఉందనుకుంటున్నా'' అని రాజీవ్ శుక్లా వెల్లడించారు.

క్రికెట్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది: దేవజిత్ సైకియా

పహల్గాం ఘటనను ఇప్పటికే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ లో సన్రైజర్స్ హైదరాబాద్ - ముంబయి ఇండియన్స్ మ్యాచ్ సమయంలో సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా ఎలాంటి సంబరాలు లేకుండా మ్యాచ్ ను నిర్వహించారు. ''జీవితాలు కోల్పోయిన అమాయక ప్రజలకు అండగా నిలుస్తాం. ఈ ఘటన గురించి తెలియగానే క్రికెట్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. బీసీసీఐ తరఫున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఈవిషయంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలిపి సంఘటితంగా పోరాడుదాం'' అని తెలిపారు.




# పంత్ పాట్లు

ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికే ఆటగాడు బాగా ఆడిన దాఖలాలే పెద్దగా కనిపించవు! యువరాజ్ సింగ్, బెన్ స్టోక్స్, క్రిస్ మోరిస్.. ఇలా ఏ ఆటగాడిని చూసినా అదే వరస! నిరుడు రూ.24.75 కోట్లతో కోల్కతా సొంతమైన మిచెల్ స్టార్క్ కూడా ఆ ధరకు న్యాయం చేయలేకపోయాడు. ఈ ఏడాది రూ.27 కోట్లతో కొత్త రికార్డు నెలకొల్పిన రిషబ్ పంత్ అయినా కథ మారుస్తాడనుకుంటే.. మునుపెన్నడూ లేనంత పేలవ ప్రదర్శన చేస్తున్నాడు. 9 మ్యాచ్లు ఆడి కేవలం ఒకే ఒక్క అర్ధశతకం సాధించడం ఇందుకు నిదర్శనం. రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఏడాదికి పైగా ఆటకు దూరంగా ఉన్న రిషబ్ పంత్.. గత ఏడాది ఐపీఎల్ తోనే పునరాగమనం చేశాడు. ఆ టోర్నీలో నిలకడగా రాణించడమే కాక, అంతర్జాతీయ క్రికెట్లోనూ సత్తా చాటాడు. ఐపీఎల్ ముంగిట అతను గొప్ప ఫామ్లో లేకపోయినా.. దిల్లీ జట్టును వీడి వేలంలోకి వచ్చిన అతడిని దక్కించుకోవడానికి ఫ్రాంఛైజీల మధ్య తీవ్రమైన పోటీ నడిచింది. దీంతో పంత్కు రికార్డు స్థాయిలో రూ.27 కోట్ల రేటు పలికింది.

అతణ్ని సొంతం చేసుకున్న లఖ్నవూ కెప్టెన్ ను చేసింది. అయితే ఐపీఎల్లో ఇలా అత్యధిక రేటు పలికిన ఆటగాళ్లలో చాలావరకు నిరాశపరిచిన నేపథ్యంలో పంత్ ఆట మీదా అభిమానులకు సందేహాలు కలిగాయి. చివరికి ఆ సందేహాలే నిజమవుతున్నాయి. 9 మ్యాచ్లో 13.25 సగటుతో కేవలం 106 పరుగులే చేశాడు లఖ్నవూ కెప్టెన్. మార్క్రమ్, మిచెల్ మార్ష్, పూరన్లతో బలంగా కనిపిస్తున్న ఎల్ఎస్జీ బ్యాటింగ్ ఆర్డర్లో పంత్ ఒక్కడే బలహీనంగా కనిపిస్తున్నాడు. మిగతా బ్యాటర్లు ఎంత రాణిస్తున్నా పంత్ వైఫల్యం జట్టును వెనక్కి లాగుతోంది. మంగళవారం దిల్లీతో మ్యాచ్ లో సమద్, బదోని, మిల్లర్లను ముందు పంపి.. పంత్ ఆఖరి ఓవర్లో బ్యాటింగ్కు రావడం అభిమానులకు విస్మయం కలిగించింది. చెన్నైతో లఖ్నవూ ఓటమి పాలైన మ్యాచ్లో మినహా పంత్ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. అతను మూడుసార్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. పంత్ కెప్టెన్గానూ చెప్పుకోదగ్గ స్థాయిలో రాణించలేకపోతున్నాడు. తన వ్యూహాలు, నిర్ణయాలు విమర్శల పాలవుతున్నాయి. చెన్నైతో మ్యాచ్లో చక్కగా బౌలింగ్ చేస్తున్న రవి బిష్ణోయ్తో కోటా పూర్తి చేయించకుండా, శార్దూల్ను దించడం, అతను భారీగా పరుగులిచ్చుకుని లఖ్నవూ ఓటమికి కారకుడవడంతో పంత్ మీద తీవ్ర విమర్శలు తప్పలేదు. దిల్లీతో గత మ్యాచ్లోనూ పంత్ కెప్టెన్సీ మీద ప్రశ్నలు తలెత్తాయి. రిషబ్ పదే పదే అసహనానికి గురి కావడం.. సహచరులపై అరవడం.. డగౌట్లో కోచ్ జహీర్ ఖాన్తోనూ వాదనకు దిగడం చర్చనీయాంశమైంది. పంత్ వికెట్ కీపింగ్లోనూ పలు తప్పిదాలు చోటు చేసుకుంటుండడం అతనెంత ఒత్తిడిలో ఉన్నాడో తెలియజేస్తోంది. ఓవైపు టీమ్ఇండియా లో వివిధ ఫార్మాట్లలో వికెట్ కీపర్ బ్యాటర్ల మధ్య పోటీ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్లో మిగతా మ్యాచ్లో పంత్ సత్తా చాటకపోతే.. భారత జట్టులో అతడి స్థానానికి ముప్పు తప్పకపోవచ్చు!



బీసీసీఐ అండర్-19

# హైదరాబాద్ సిటీ అమ్మాయిలకు అవకాశం

- స్థానం దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (మనం న్యూస్): బీసీసీఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్ 19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి సిటీకి చెందిన ఆరుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఒకే సారి ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కే.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పీవీ హంసకి, సీపీ పార్వతి, ఈ.శృజన అనే సిటీ క్రికెట్ ప్లేయర్లు



త్వరలోనే జట్టు-ఏగా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీ, కాగా, టీమ్ -డీలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్-బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బీసీసీఐ అండర్-19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో శుక్రవారం ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొంటారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

# 'శుభం' ట్రైలర్.. ఏరోజైనా.. ఎప్పుడైనా రావచ్చు - సమంత



స్టార్ బ్యూటీ సమంత ఇప్పుడు నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. 'ట్రాలాలా' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించిన సమంత తొలి సినిమాగా 'శుభం' అనే చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తోంది. ఈ సినిమాలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రవీణ్ కండ్రేగుల డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను కామెడీ జోనర్లో తెరకెక్కిస్తున్నారు. ఇక ఇప్పటికే షూటింగ్ ముగించుకున్న ఈ సినిమాను వేసవి కానుకగా మే 9న రిలీజ్ చేసేందుకు సమంత ప్లాన్ చేస్తోంది. అయితే, ఈ సినిమా ట్రైల్ర సామ్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చింది. 'శుభం' ట్రైలర్.. ఏరోజైనా.. ఎప్పుడైనా రావచ్చు.. అంటూ సామ్ తన సోషల్ మీడియా అకౌంట్లో పోస్ట్ చేసింది. దీంతో ఈ సినిమా ట్రైలర్ త్వరలోనే రిలీజ్ కాబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ సినిమాకు వివేక్ సాగర్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

# ఆ డైరెక్టర్ తో కళ్యాణ్ రామ్ నెక్స్ట్ మూవీ..?




నందమూరి కళ్యాణ్ రామ్ రీసెంట్గా 'అర్జున్ ఖ్/ వైజయంతి' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి డైరెక్ట్ చేసిన ఈ సినిమా యాక్షన్ డ్రామాగా తెరకెక్కించారు. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు. అయితే, ఈ సినిమా ఊహించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఈ సినిమా రిజల్ట్ తర్వాత కళ్యాణ్ రామ్ ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నాడట. ఈ క్రమంలోనే గిరీశయ్య అనే డైరక్టర్ కళ్యాణ్ రామ్కు ఓ కథను చెప్పినట్లు తెలుస్తోంది. కల్ట్ మూవీ అయిన 'అర్జున్ రెడ్డి' చిత్రాన్ని తమిళంలో 'ఆదిత్య వర్మ' అనే పేరుతో రీమేక్ చేశాడు గిరీశయ్య. ఇక మెగా హీరో వైష్ణవ్ తేజ్ నటించిన 'రంగ రంగ వైభవంగా' సినిమాను కూడా ఆయనే డైరెక్ట్ చేశాడు. ఇప్పుడు కళ్యాణ్ రామ్ కోసం ఓ పవర్ఫుల్ యాక్షన్ డ్రామా కథను రెడీ చేశాడట. అయితే, కళ్యాణ్ రామ్ ఈ డైరెక్టర్ని హోల్డ్లో పెట్టినట్లుగా తెలుస్తోంది. 'బింబిసార 2' సినిమాను స్టార్ట్ చేయాలని కళ్యాణ్ రామ్ ఆలోచిస్తున్నాడట. కానీ, ఆ సినిమాకు కావాల్సిన స్క్రిప్ట్ వర్క్ ఇంకా పూర్తి కాలేదని.. అందుకే గిరీశయ్యతో కళ్యాణ్ రామ్ సినిమా చేసే అవకాశం ఉందని సినీ సర్కిల్స్లో టాక్ వినిపిస్తోంది.

టాలీవుడ్ లో ఇప్పుడు అందరి చూపులు మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో తెరకెక్కబోయే సినిమాపై ఉన్నాయి. ఈ సినిమాను ఇప్పటికే అఫీషియల్ గా అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఎప్పుడెప్పుడు ఈ సినిమా షూటింగ్ మొదలుపెడతారా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ వార్త

# మెగాస్టార్ సినిమాలో కార్తికేయ విలనిజం..?

వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవిని ఢీకొనే విలన్ పాత్రను పవర్ ఫుల్ గా డిజైన్ చేశాడట అనిల్ రావిపూడి. దీంతో ఈ పాత్రలో నటించేందుకు యంగ్ హీరో కార్తికేయ అయితే బాగుంటుందని చిత్ర యూనిట్ భావిస్తుందట. గతంలోనూ ఒకట్రెండు చిత్రాల్లో విలన్ గా తన సత్తా చాటాడు ఈ యంగ్ హీరో. దీంతో ఇప్పుడు ఈ హీరోకు మెగా ఛాన్స్ దక్కే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు చిత్ర వర్గాల టాక్. ఇక ఈ సినిమాకు భీమ్స్ సంగీతం అందిస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి ప్రొడ్యూస్ చేయనున్నారు.





# నేను పాకిస్థానీని కాదు..

కశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిని యావద్భారతం ఖండించింది. ఈ దాడి నేపథ్యంలో దాయాది పాకిస్థాన్ తో సంబంధాలపై భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోన్న విషయం తెలిసిందే. అయితే పాకిస్థాన్ నటీనటులు మన సినిమాల్లో నటించడానికి వీల్లేదంటూ నెట్టింట పోస్ట్ లు షేర్ అవుతున్నాయి. దీంతో ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో హీరోయిన్ ఇమాన్వీ ఎస్మాయిల్ ఒక్కసారిగా హాట్ టాపిక్ గా మారారు. ఆమె పాకిస్తానీ అంటూ.. ఆమెను తీసుకోవద్దంటూ పోస్ట్ లు షేర్ అవుతున్నాయి. ఈ విషయంపై ఇమాన్వీ క్లారిటీ ఇచ్చారు. తాను పాకిస్థానీ నటిని కాదని స్పష్టంచేస్తూ పోస్ట్ పెట్టారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ''నాకు, నా కుటుంబానికి సంబంధించిన కొన్ని తప్పుడు వార్తలు నెట్టింట ప్రచారం అవుతున్నాయి. నేను పాకిస్థానీని కాదు. నాకు, నా కుటుంబంలోని ఎవరికీ ఆ దేశంతో సంబంధాలు లేవు. నాపై ద్వేషాన్ని కలిగించాలనే ఏకైక ఉద్దేశంతో ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తున్నారు. కొన్ని పేరున్న వార్తా సంస్థలు కూడా నా విషయంలో కనీస పరిశోధనలు చేయకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయి'' అని పేర్కొన్నారు. ''నేను భారత అమెరికన్ ని అని గర్వంగా చెబుతాను. హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లిష్ మాట్లాడగలను. లాస్ ఏంజెలెస్ లో పుట్టాను. నా తల్లిదండ్రులు అమెరికాకు వలసవెళ్లి.. అక్కడి పౌరులుగా మారారు. నేను చదివింది కూడా అక్కడే. చదువు పూర్తయిన తర్వాత నటిగా, కొరియోగ్రాఫర్ గా, డ్యాన్సర్ గా కెరీర్ ను ప్రారంభించాను. ఈ రంగంలో ఎంతోకాలం కొనసాగిన తర్వాత భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పనిచేసే అవకాశాలను అందుకున్నాను. ఈ విషయంలో ఎంతో ఆనందంగా ఉన్నాను. సినిమా నా జీవితంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. భారతీయత, భారత సంస్కృతి నా రక్తంలోనే ఉంది. సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించండి'' అని తన పోస్ట్ లో రాసుకొచ్చారు. ఉగ్రదాడి ఘటన దారుణమని మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. తన డ్యాన్స్, స్టైల్ తో సోషల్ మీడియాలో ఎంతోమంది ఫాలోవర్స్ ను సొంతం చేసుకున్నారు ఇమాన్వీ. దీంతో ప్రభాస్- హను రాఘవపూడి కాంబోలో రానున్న సినిమాలో అవకాశాన్ని అందుకున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమంలోనూ ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఇది రానుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.